
మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట
వార్త



## ఆయిల్ పామ్ సాగుకై రైతులకు ప్రభుత్వం ప్రోత్సాహం : శైలజ

**గుమ్మడిదల, జులై 20, ప్రభాతవార్త:** సంగారెడ్డి జిల్లాలో ఆయిల్ పామ్ సాగుకై ప్రభుత్వం అనుమతిని ఇవ్వడం జరిగిందని ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ అధికారిని శైలజ అన్నారు. శనివారం ఆమె మాట్లాడుతూ గోద్రెజ్ ఆగ్రోవేట్ కంపెనీకి సంగారెడ్డి జిల్లాలో పామ్ ఆయిల్ తయారీ కంపెనీ మొదలు పెట్టడానికి అనుమతిని కూడా ఇచ్చిందన్నారు. 2022-23కి గాను సంగారెడ్డి జిల్లాకు ఐదు వేల ఎకరాలను లక్ష్యంగా కేటాయించిందన్నారు. ఆయిల్ పామ్ మొక్కలను సబ్సిడీలో సరఫరా చేయడం, ఆయిల్ పామ్ మొక్కలు పెట్టుకునే రైతులకు డ్రిప్ సబ్సిడీలో ఇవ్వడం, నాలుగు సంవత్సరాల వరకు అంతర పంట వేసుకోవడానికి సబ్సిడీ ఇవ్వడం జరుగుతుందని వివరించారు. దరఖాస్తు పత్రంతో పాటు రైతులు పొందుపరచవల్సిన ఇతర పత్రాల వివరాలు పట్టా పాస్‌బుక్ జిరాక్స్ కాపీ, బ్యాంక్ పాస్‌బుక్ జిరాక్స్ కాపీ, ఆధార్‌కార్డు జిరాక్స్ కాపీ, 3 పాస్‌పోస్టు సైజ్ ఫోటోలతో ఆసక్తి గల రైతులు సంబంధిత ఉద్యాన మరియు పట్టు పరిశ్రమశాఖ అధికారిని గాని, వ్యవసాయ విస్తరణ అధికారిని గానీ, మండల వ్యవసాయ అధికారిని సంప్రదించాలని కోరారు.

## హోం మంత్రి మహమూద్ అలీని కలిసిన మాణిక్యం

**పటాన్‌చెరువు, జులై 22, ప్రభాతవార్త:** రాష్ట్ర హోంమంత్రి మహమూద్ అలీని శనివారం పటాన్‌చెరువు నియోజకవర్గ కిష్టారెడ్డిపేట గ్రామానికి చెందిన బిఆర్ఎస్ సీనియర్ నాయకులు మాణిక్యం మర్యాద పూర్వకంగా కలిశారు. తొమ్మిదవ హరితహారంలో భాగంగా హోంమంత్రి మహముద్ అలీని మాణిక్యం మొక్కలను అందజేశారు. ఈ సందర్భంగా మాణిక్యం మాట్లాడుతూ హరితహారంలో భాగంగా హోం మంత్రి మహమూద్‌అలీని హైదరాబాద్‌లోని ఆయన కార్యాలయంలో కలిసినట్లు తెలిపారు. ప్రతి ఒక్కరు హరితహారంలో భాగంగా మొక్కలను నాటాలని పిలుపునిచ్చారు. ఇప్పుడు మనమందరం మొక్కలను నాటితే భవిష్యత్తు తరాలకు మంచి ఆక్సిజన్‌తో పాటు మంచి వాతావరణాన్ని అందించిన వాళ్ళం అవుతామని ఆయన పేర్కొన్నారు.



హోం మంత్రికి మొక్కను అందజేస్తున్న దృశ్యం



ఆసుపత్రి సూపరింటిండెంట్‌కు సూచనలు ఇస్తున్న కలెక్టర్ రాజర్షిషా

## డయాలసిస్ కేంద్రాన్ని ఇబ్బందులు లేని భవనంలోకి మార్చాలి

**-జిల్లా కలెక్టర్ రాజర్షిషా**

**మెదక్ అర్బన్, జూలై22 ప్రభాతవార్త:** ప్రస్తుతం మెదక్ జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్నందున జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలోని డయాలసిస్ కేంద్రాన్ని అన్ని సౌకర్యాలు ఉండే మరో భవనంలోకి మార్చాలని, ఈ విషయంలో ఏ మాత్రం నిర్లక్ష్యం వహించరాదని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. శనివారం జిల్లా ఆసుపత్రిలోని డయాలసిస్ కేంద్రాన్ని కలెక్టర్ రాజర్షిషా పరిశీలించారు. ఈ సందర్భంగా డయాలసిస్ కేంద్రాన్ని పూర్తిగా పరిశీలించి ఇబ్బందులు ఉన్నందున ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని, అందుకుగాను ప్రక్కన ఉన్న మరో భవనంలోకి మార్చాల్సిందిగా జిల్లా ఆసుపత్రి సూపరింటిండెంట్ డాక్టర్ చంద్రశేఖర్‌కు సూచించారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో డయాలసిస్ చేసుకొంటున్న పేషెంట్లకు వైద్యం అందుతున్న తీరును స్వయంగా కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. అలాగే డయాలసిస్ కేంద్రంలో ఎంత మంది వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉన్నారు, వారి సమయాలు తదితర వివరాలపూ అక్కడే ఉన్న సిబ్బందతో స్వయంగా మాట్లాడారు. అనంతరం డయాలసిస్ కేంద్రం చేపట్టాల్సిన చర్యలపై సలహాలు, సూచనలు చేశారు. వర్షాలను దృష్టిలో ఉంచుకొని వెంటనే ప్రస్తుతం ఉన్న కేంద్రంలో నుంచి ప్రక్కనే ఉనన భవనంలోకి మార్చాల్సిందిగా, ఈ విషయలో ఏ మాత్రం నిర్లక్ష్యం వహించరాదని కలెక్టర్ రాజర్షిషా ఆదేశించారు.

## మణిపూర్ ఘటన అమానుషం

**-బీఎస్పీ జిల్లా అధ్యక్షులు నర్సింలు**



మాట్లాడుతున్న బీఎస్పీ జిల్లా అధ్యక్షులు నర్సింలు

**కొల్చారం, జూలై22 ప్రభాతవార్త:** మణిపూర్‌లో ఆదివాసి మహిళలను అతి క్రూరంగా హింసించి నగ్నంగా రోడ్డుపై ఊరేగింపుగా త్రిప్పుతున్న దృశ్యాలను చూస్తే దేశంలోని సభ్య సమాజం తలదించుకునేటట్లు చేసిన ఈ ఘటనను బీజేపీ ప్రభుత్వం చూసి చూడనట్లు వ్యవహరిస్తుందని బీఎస్పీ జిల్లా అధ్యక్షులు కుతాడి నర్సింలు అన్నారు. శినవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ ఘటన గత మే నెలలో జరిగినా పట్టించుకోని ఈ ప్రభుత్వాన్ని గద్దె దించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అలాగే ఈ మధ్యన మధ్యప్రదేశ్‌లో ఆదివాసి యువకుడిపై బీజేపీ నాయకుడు మూత్రం పోసిన ఘటన కూడా జరగడం సిగ్గుచేటన్నారు. దేశంలో బీజేపీ ప్రభుత్వంలో అమాయక ప్రజలపై హత్యలు, మానభంగాలు, దౌర్జన్యాలు తదితర ఘటనలు పేట్రేగిపోతున్నాయన్నారు. ఈ ఘటనకు బాధ్యులైన వారిని కఠిణంగా శిక్షించాలని, దేశంలో ఈ తరహాలో మరెవరికీ జరగకుండా చూడాలని మెదక్ జిల్లా బీఎస్పీ పక్షాన డిమాండ్ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇంచార్జి మానయ్య, జిల్లా ఉపాధ్యక్షులు స్వామి దాస్, ఆర్గనైజింగ్ సెక్రటరీ రవిగౌడ్, నర్సాపూర్ నియోజకవర్గ అధ్యక్షులు జనార్ధన్‌గౌడ్ పాల్గొన్నారు.

## కల్వర్టును పరిశీలించిన అధికారులు



శిథిలావస్థకు చేరిన కల్వర్టును పరిశీలిస్తున్న నీటి పారుదల శాఖ ఏఈ తిలక్‌రాజు

**వార్తకు స్పందన**

**అల్లాదుర్గం, జూలై 22 ప్రభాతవార్త:** ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు అల్లాదుర్గం బీటీ రోడ్డుపై భారీగా వరద నీరు ప్రవహిస్తుండటంతో రాకపోకలకు ఇబ్బందులు అనే శీర్షికన ప్రభాత వార్త దినపత్రికలో కథనం ప్రచురితమైంది. దీంతో శనివారం నీటి పారుదల శాఖ ఏఈ తిలక్‌రాజు స్పందించి బీటీ రోడ్డుపై నీరు ప్రవహిస్తున్న స్థలాన్ని పరిశీలించారు. ప్రక్కనే ఉన్న కల్వర్టు శిథిలావస్థకు చేరడంతో ఈ సమస్య ఏర్పడిందని గ్ర హించారు. అంతేకాకుండా లోతుగా ఉండి వరదనీరు ప్రవహిం చడానికి కల్వర్టు అనుకూలంగా లేకపోవడంతో రోడ్డుపై నుండి నీరు ప్రవహిస్తుందని తెలిపారు. వరద నీరు ప్రవహించే సమయంలో గంటల తరబడి ప్రయాణికులు, వాహనదారులు ఇబ్బందులు ఎదర్కుంటున్నారని తమ దృష్టికి వచ్చిందన్నారు. శిథిలవాస్థలో ఉన్న కల్వర్టు స్థానంలో నూతన కల్వర్టు మంజూరు చేసి నిర్మిస్తే ఈ సమస్య తొలగిపోతందన్నారు. ఈ సమస్యను నీటి పారుదల శాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిచేందుకు కృషి చేస్తానని ఆయన గ్రామస్థులకు హామీ ఇచ్చారు. ఈయన వెంట అల్లాదుర్గం అసెంబ్లీ సాధన సమితి అధ్యక్షులు బ్రహ్మం తదితరులు ఉన్నారు.

## విద్యుత్ శాఖ నూతన ఏఈగా శ్రీకాంత్

**పెద్దశంకరంపేట, జూలై22 ప్రభాతవార్త:** పెద్దశంకరంపేట మండల విద్యుత్ ఏఈగా శ్రీకాంత్ శనివారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ ఏఈగా పనిచేసిన అరుణ్ విజిలెన్స్ విభాగానికి బదిలీ అయ్యారు. ఇంతకుముందు నల్గొండ జిల్లాలో పనిచేసిన శ్రీకాంత్ బదిలీపై పెద్దశంకరంపేటకు వచ్చారు.

# యోగాతో ఆరోగ్య ఆయుష్షు

**ఆరోగ్యమే ఆనందం.. గల్లి గల్లిలో యోగా శిబిరం**

**మంత్రి హరీష్‌రావు సంకల్పం.. సిద్దిపేటలో వినూత్న యోగా కార్యక్రమం**



యోగా మ్యాట్స్ పంపిణీ చేస్తున్న దృశ్యం

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :** ఆరోగ్యం అంటే అసుపత్రులు, డాక్టర్లు మాత్రమే కాదని ప్రజలు అనారోగ్యాలకు దూరంగా అనందంగా ఉండడమే మంత్రి హరీష్‌రావు లక్ష్యం. ఇందుకు అనుగుణంగా కార్యాచరణ ప్రణాళికను రూపొందించారు. మంత్రి అశయానికి సిద్దిపేట జిల్లా యోగాసనా స్పోర్ట్స్ అసోసియేషన్, వ్యాస మహర్షి యోగా సొసైటీ వినూత్నంగా రూపొందించిన అనంద యోగ శిక్షణ శిబిరానికి కార్యరూపం ఇచ్చారు.

**వార్డు వార్డులో యోగా..**

అ ందరికీ అరోగ్యం అనే మంత్రి హరీష్‌రావు అలోచనతో సిద్దిపేట పట్టణంలోని వార్డు వార్డులో ఇంటింటికి ఉచితంగా యోగ విద్యను అందించి కుటుంబాలన్నీ సంతోషంగా ఉండాలనే సంకల్పం ప్రయోగాత్మకంగా ప్రారంభమైంది. మంత్రి క్యాంపు కార్యాలయంలో ప్రారంభమైన ఈ శిక్షణ శిబిరం క్రమ క్రమంగా అన్ని వార్డుల్లోకి వెళ్తుంది. ఇందులో భాగంగా 22వ వార్డులో జూలై 10న ప్రారంభమైంది. శ్రీచైతన్య టెక్నో సూ క్ల్, హరిప్రియనగర్‌లో యోగ శిక్షణ ఇస్తున్నారు. ప్రతి రోజు వంద మంది పురుషులు, మహిళలు యోగా శిక్షణలో పాల్గొంటున్నారు. ఇలా అన్ని వార్డులలో ప్రజలందరూ యోగ చేసే విధంగా మంత్రి హరీష్ రావు కార్యరూపం దాల్చారు.

25 నుంచి రైస్ మిల్లర్స్ అసోసియేషన్‌లో యోగ శిబిరం పట్టణంలోని 22వ వార్డులో యోగ శిబిరం పూర్తి కాగా మరొక నూతన శిబిరం ఈనెల 25న సిద్దిపేటలోని రైస్ మిల్లర్స్ భవనంలో అనందయోగ శిక్షణ శిబిరం ప్రారంభం కానున్నది. అసనాలు,ప్రాణాయామం, ధ్యాన్యం,అమృతాహారం, అరోగ్య సూత్రాలు, వ్యక్తిత్వ వికాసంతో పాటు మనసు,శరీర అనందంతో నవ్వుతూ సాగిపోవాలని అశహానికి ప్రజలు మద్దతు లభిస్తుంది. అనంద యోగ శిక్షణ శిబిరంలో పాల్గొనే వారికి మంత్రి హరీష్‌రావు ప్రోత్సాహక బహుమతులను అందించడం విశేషం. ఈ అద్భుత అనంద యోగ ప్రయోగం రానున్న రోజుల్లో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో కూడా విస్తరించే అవకాశం ఉంది. అనంద యోగ శిబిరంలో పాల్గొన్న వారు చిరునవ్వులతో బయటకు రావడం, సంతోషాన్ని వ్యక్తం చేయడం శిబిరం విజయవంతానికి నిదర్శనం. రాష్ట్ర యోగ అధ్యాయన పరిషత్ సభ్యులు, ప్రముఖ యోగ శిక్షకులు తోట సతీష్,తోట సంధ్యల నేతృత్వంలో అనంద యోగ శిక్షణ శిబిరాలు కొనసాగుతున్నాయి.



ముంపు ప్రాంతంలో స్థానికులతో మాట్లాడుతున్న ఆర్డీఓ రవీందర్‌రెడ్డి

## ముంపు ప్రాంతాల్లో తక్షణ చర్యలు

**సంగారెడ్డి ఆర్డీఓ రవీందర్‌రెడ్డి**

**సంగారెడ్డి మున్సిపాలిటీ, జులై 22,ప్రభాతవార్త:** ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో సంగారెడ్డి మున్సిపాలిటీ పరిధిలో ముంపు ప్రాంతాలను సంగారెడ్డి ఆర్డీఓ రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో మున్సిపల్, రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల అధికారులు పర్యటించారు. మున్సిపాలిటి పరిధిలోని ఎర్రకుంట వర్షపునీటితో నిండి పోవడంతో సమీపంలోని ఇండ్లలోనికి నీరు చేరే అవకాశం ఉందని స్థానికులు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్ళడంతో అధికారులు ముంపు ప్రాంతాలను పర్యటించారు. కుంటలో చేరిన నీటిని అధికారులు పరిశీలించారు. అధికంగా ఉన్న నీటి దిగువ ప్రాంతానికి తరలించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలను సంబందిత అధికారులకు ఆర్డీఓ రవీందర్‌రెడ్డి ఆదేశించారు. మున్సిపల్ అధికారులు యంత్రాలను ఉపయోగించి నిల్వనీటిని దిగవ ప్రాంతానికి తరలించేందుకు యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టారు. ఆర్డీఓ రవీందర్‌రెడ్డి వెంట మున్సిపల్ కమిషనర్ సుజాత, డిప్యూటీ ఇఇ ఇంతీయాజ్, తహసీల్దార్ విజయ్, ఆర్‌ఓ విజయలక్ష్మి, స్థానిక కౌన్సిలర్లు నాగరాజు, మెహమ్మద్ సమీ, సానిటేషన్ ఇన్స్‌పెక్టర్ సైదులు, ఇరిగేషన్‌శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# చెరుకు బిల్లులు ఇప్పిస్తాం.. ఫ్యాక్టరీపై అపోహాలు వద్దు

**విలేఖరులతో ఎమ్మెల్యే మాణిక్‌రావు**



విలేఖరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

**జహీరాబాద్, జులై 22, ప్రభాతవార్త:** జహీరాబాద్ మండలంలోని కొత్తూర్(బి) గ్రామంలోని ట్రైడెంట్ చక్కర కర్మాగారానికి చెరుకును తోలిన చెరుకు రైతులందరికి బకాయి బిల్లులు చెల్లించేందుకు కృషి చేస్తున్నామని, కర్మాగారపై రైతులు అపోహాలు పడొద్దని ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు భరోసా ఇచ్చారు. శనివారం పట్టణంలోని సిడిసి కార్యాలయంలో డిసిఎంఎస్ చైర్మన్ మల్కాపురం శివకుమార్, సిడిసి చైర్మన్ ఉమాకాంత్ పాటిల్‌లతో కలిసి ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ చెరుకు రైతులకు 12 కోట్ల రూపాయలు బకాయిలు ఉండగా ఈ నెల 15వ తారీఖు వరకు మూడున్నర కోట్ల రూపాయలను చెల్లించారని గుర్తు చేశారు. బకాయిగా ఉన్న మిగతా బిల్లులను త్వరలోనే రైతులకు చెల్లించేలా యాజమాన్యంపై ప్రభుత్వం వత్తిడి తెస్తున్నామన్నారు. బిల్లుల విషయంలో రైతులు అధైర్యపడాల్సిన అవసరం లేదన్నారు. ఈ సారి కర్మాగారం నడవదని, కంపెనీని అమ్మేస్తున్నారని కొందరు తప్పుడు ప్రచారం చేస్తున్నారని, వారి మాటలను రైతులు పట్టించుకోవాల్సిన అవసరం లేదన్నారు. చెరుకు రైతులకు రావాల్సిన బకాయి బిల్లులతో పటు కార్మికులకు అందాల్సిన బకాయి వేతనాలు చెల్లించేలా చర్చలు జరుపుతామన్నారు. కర్మాగారంలోని సామాగ్రిని అమ్మకుండా జిల్లా ఎస్‌పి ఫిర్యాదు చేసి పోలీసు బందోబస్తును పెట్టిస్తామన్నారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు వై నరోత్తం, ఢిల్లీ వసంత్, ఆత్మ కమిటి చైర్మన్ ఎస్ పెంటరెడ్డి, జహీరాబాద్, కోహీర్, మొగుడంపల్లి మండలాల బిఆర్ఎస్ అద్యక్షులు ఎంజి రాములు యాదవ్, నర్సింలు యాదవ్, శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు గుండప్ప, మంకాల్ సుభాష్, సొసైటీ చైర్మన్ మచ్చేందర్, ఇజయ్ కుమార్, మాజీ జడ్పీటిసి సభ్యులు మాణిక్యమ్మ, తంజీం తదితరులు పాల్గొన్నారు.

## నాణ్యత నవ్వుల పాలు.. కాసులు కాంట్రాక్టర్ పాలు..!

**నీటికాల్వ నిర్మాణం పూర్తి కాక ముందే కూలిన వైనం**



నాణ్యతలేని నిర్మాణాలు చేపట్టడంతో సిమెంట్ కాల్వ కూలీ పోయిన దృశ్యం

**టేక్మాల్, జూలై,22 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మిషన్ కాకతీయ పనులపై పర్యవేక్షణ కరువై అస్తవ్యస్తంగా తయరయ్యాయి. రైతుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం కోట్లాది రూపాయల వ్యవయంతో చెరువుల పూడిక కట్టల మరమ్మత్తు, అలుగులు, తూముల కట్టడాలకు శ్రీకారం చుట్టింది. బారెడు నిధులు మంజూరు చేస్తే నాణ్యతలేని మూరేడు నిర్మాణాలు చేపట్టి నాణ్యతను నవ్వుల పాలు జేసి కాంట్రాక్టర్లు, అధికారులు కాసుల పర్సెంటేజీలల్లో మునిగి తెలుతున్నారన్న ఆరోపణలున్న బలంగా ఉన్నాయి. కాగా బాద్యత లేని కొందరు కాంట్రాక్టర్లు అడపా దడపా పనులు చేసి చేతులు దులుపుకున్నారని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. అవసరం లేకున్నా చెరువులకు లక్షలాది రూపాయలు మంజూరు చేయించుకోని కాంట్రాక్టర్లు, అధికారులు కుమ్మక్కై ప్రభుత్వ నిధులను దుర్వినియోగానికి పాల్పడుతున్నారు. ఇటివల ఓ కాంట్రాక్టర్ టేక్మాల్ పంతులు చెరువులో నాణ్యత లేకుండా నిర్మించటంతో వర్షానికి నాణ్యత కాస్త నవ్వుల పాలై కాసులు కాంట్రాక్టర్ పాలు అవుతున్నాయని ఆయా కట్టదారులు ఆరోపిస్తున్నారు. కాగా కట్టడాలపై పర్యవేక్షణ చేయాల్సిన అధికారులు మాముళ్ళ మత్తులో నిద్రిస్తున్నారన్నది అంటున్నారు. మండల కేంద్రంలో అన్నిశాఖల అధికారుల దర్శనం దొరుకుంతుంది కాని ఇరిగేషన్ అధికారుల దర్శనం దొరకడం చాల కష్టంమని అంటున్నారు ప్రజా ప్రతినిధులు. మిషన్ కాకతీయ పనులు కాస్తా కమిషన్ కాకతీయగా మారిందని పలువురు విమర్శిస్తున్నారు.

**వివరణ:** పై విషయమై టేక్మాల్ ఇరిగేషన్ మండల ఎఇ ప్రణితను ప్రభాతవార్త వివరణ కోరగా టేక్మాల్ పంతులు చెరువు పనులు ప్రస్తుతం వర్కింగ్‌లో ఉన్నాయన్నారు. వాటికి సంబంధించిన పూర్తి వివరాలు తనవద్ద లేవని అప్పట్లో ఉన్న అధికారుల వద్ద ఉన్నాయని వారు తనకు అందుబాటులో లేరన్నారు. రెండు రోజులు టైం ఇస్తే పూర్తి వివరాలు అందజేస్తామన్నారు. నిర్మాణం పూర్తి కాక ముందే కూలీ పోయి పనులు తిరిగి నిర్మిస్తారన్నారు.

# రామాయంపేట అభివృద్ధికి రూ.20 కోట్లు

**సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి : ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి**



విలేఖరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి, పాల్గొన్న ఎంపీ ప్రభాకర్‌రెడ్డి

**రామాయంపేట, జూలై 22, ప్రభాతవార్త:** రామాయంపేట మున్సిపల్ పరిధిలో దెబ్బతిన్న రోడ్ల మరమ్మత్తులతో పాటు, మురికి కాలువల నిర్మాణం, పట్టణ అభివృద్ధి కోసం ప్రభుత్వం 20 కోట్ల రుపాయలను మంజూరు చేయడం జరిగిందని, మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి తెలిపారు. శనివారం క్యాంప్ కార్యాలయంలో, మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డితో కలిసి విలేఖరులతో మాట్లాడారు. మిషన్ భగీరథ పనుల సమయంలో పట్టణంలో వార్డుల్లో కొన్ని వార్డులో రోడ్లు దెబ్బతిన్నాయని, వాటిని త్వరితగతిన పూర్తి చేయిస్తామని అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డుల్లో అన్ని రకాల సౌకర్యాలను కల్పిస్తామన్నారు. సీజనల్ వ్యాధులు వ్యాపిస్తున్న క్రమంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మెదక్ నియోజకవర్గ వ్యాప్తంగా 7 డెంగి కేసులు నమోదయ్యాయని తెలిపారు. రామాయంపేట పట్టణంలో కరెంట్ పదే, పదే తిసివేస్తున్నారని కొందరు ఎమ్మెల్యే దృష్టికి తిసుకెళ్లగా, సబంధిత అధికారులతో మాట్లాడి, సమస్య ఎంటో చెప్పి శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా రామాయంపేట పట్టణానికి చెందిన కొందరు మహిళలు తాము చిట్టీలు వేసిన దంపతులు పరారీ అయినట్లు తెలిపారు. వారి వద్ద నుండి లక్షల రుపాయలు రావాల్సి ఉందని, ఈ విషయంలో సహాయం చేయాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే బాధితులకు విలైనంతలో సహకారం అందించాలని స్థానిక సిఐ, ఎస్‌ఐలకు తెలిపారు. అలాగే పట్టణంలో గత కొన్ని ఏళ్ల నుండి మట్కా నడుస్తుందని, దీంతో యువత పాడైపోతుందని, ప్రభాతవార్త విలేఖరి ఎమ్మెల్యే దృష్టికి తిసుకెళ్లగా వెంటనే స్పందించిన ఎమ్మెల్యే మట్కా నిర్వాహకులపై నడిపించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సిఐకి తెలిపారు. ఈ విషయాన్ని తాను జిల్లా పోలీసు ఉన్నతాధికారి దృష్టికి తిసుకెళ్తానని తెలిపారు. నార్సింగి మండలానికిచెందిన బిఆర్ఎస్ నాయకుడు తార్య నాయక్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం పట్ల, ఎమ్మెల్యే పద్మ, ఎంపి కొత్త ప్రభాకర్ సంతాపం వ్యక్తం చేశారు.

**బిజెపి,కాంగ్రెస్‌లు వెంటిలేటర్‌పై ఉన్న పార్టీలు**

**మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి విమర్శ**

బిజెపి, కాంగ్రెస్ పార్టీలు వెంటిలేటర్‌పై బతుకుతున్న పార్టీలని మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి అభివర్ణించారు. అధికారంలోకి రావాలని పగటి కలలుకంటున్నారని ఎద్దేవా చేశారు. దేశంలోని సంక్షేమ పథకాలలో తెలంగాణ అభివృద్ధిలో ఆదర్శంగా నిలిచిందన్నారు. చుట్టు ప్రక్కల రాష్ట్రాల, ప్రజలను సైతం ఆకర్షించుకున్న తెలంగాణలో బిఆర్ఎస్ పార్టీకి తప్ప మరో పార్టీకి స్థానం లేదన్నారు. ఎన్ని కుట్రలు చేసిన ప్రజలు మాత్రం బిఆర్ఎస్ వెంట ఉన్నారని, మళ్లి కేసీఆర్‌ని ముఖ్యమంత్రి కావాలని కోరుకుంటున్నారని అన్నారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో అన్ని స్థానాలు బిఆర్ఎస్ కైవసం చేసుకోవడం ఖాయం అని అన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్మన్ పల్లె జితేందర్‌గౌడ్, వైస్ చైర్మన్ పుట్టి విజయలక్ష్మీ, ఏఎంసీ మాజీ చైర్మన్ సరాఫ్ యాదగిరి, కౌన్సిలర్లు చంద్రపు శోభ, కొండలరెడ్డి, మల్యాల కిషన్, కో-ఆప్షన్ సభ్యులు ఐరెని బాలుగౌడ్, ఎస్‌కే అహ్మద్, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# హుస్నాబాద్‌లో మాకేం తిరుగుండదు

**-రెడ్డి సామాజిక ఓట్లు ఏం చీలవు**

**-అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి విజయం ఖాయం**

**వార్తకు స్పందన**

**హుస్నాబాద్,జూలై22,ప్రభాతవార్త:** హుస్నాబాద్ నియోజకవర్గంలో కమలం అభ్యర్థి ఎవరో శీర్షికన ప్రచురితమైన వార్త కథనానికి స్పందించిన హుస్నాబాద్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ పక్షాన హుస్నాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ శనివారం స్పందించింది. ఈ మేరకు రెడ్డి సామాజిక ఓట్లు చీలి ప్రవీణ్‌రెడ్డి ఒటమికి ఖాయమనే రీతిన ఇక్కడి ప్రజలు ఏం భావించడంలేదని కాంగ్రెస్ పార్టీ ప్రకటించింది. ఈ మేరకు హుస్నాబాద్ కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ అనాడు 2014లో మెగాస్టార్ చిరంజీవి స్థాపించిన ప్రజారాజ్యం పార్టీ తరపున రెడ్డి సామాజికవర్గా నికే సంబంధించిన ఇనుగాల పెద్దిరెడ్డి అనే మాజీమంత్రి బరిలో ఉన్నప్పటికీ హుస్నాబాద్ స్థానంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి విజయం సాధించారని వారు అంటున్నారు. బిజెపి బరిలో రెడ్డి సామాజికవర్గం అభ్య ర్థులు బరిలో నిల్చున్నా కాంగ్రెస్ పార్టీకి ఒరిగిదేమీ ఉండ దని కాంగ్రెస్ పార్టీ భావిస్తోంది. అలాగే కాంగ్రెస్ పార్టీకి అండగా బలహీనవర్గాలు,షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డు తెలకు చెందిన వారు అండగా నిలుస్తారని ఘంటా పథంగా చెబుతున్నారు. హుస్నాబాద్ నియోజకవర్గంలో ఎన్నికుట్రలు కుతంత్రాలు చేసినా కాంగ్రెస్‌పార్టీకి ఒరిగిదేమీ ఉండదని కాంగ్రెస్‌పార్టీ వర్గాలు అంటున్నాయి.ఇదిలా ఉండగా హుస్నాబాద్ బిజెపి శ్రేణుల వ్యాఖ్యలు మరోలా ఉన్నాయి. అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి అనాడు కాంగ్రెస్ పార్టీని వదిలి తెలం గాణ రాష్ట్రసమితి అధికారంలోకి రాగానే ఆపార్టీలో చేరి జంప్‌జిలానీగా పేరు తెచ్చుకున్న అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి హు స్నాబాద్‌లో విజయం సాధించినా కెసిఆర్ బాణమైన అతను తిరిగి మరలా ఏపార్టీలోకి పోదని నమ్మకం లేదని బిజెపి పార్టీకి చెందిన క్యాడర్ అంటోంది. బిజెపి పక్షాన హు స్నాబాద్ నియోజకవర్గంలో కుక్కను నిలబెట్టినా గెలుపు ఖాయమనే ధీమాను బిజెపి వ్యక్తం చేస్తోంది.

## మణిపూర్ ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నాం

**-టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు సంగయ్య**

**మెదక్ మున్సిపాలిటీ, జూలై22 ప్రభాతవార్త:** మణిపూర్‌లో కుకీ తెగకు చెందిన ఆదివాసీ మహిళలను నగ్నంగా ఊరేగించి లైంగిక దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు సంగయ్య అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మణిపూర్‌లోని ప్రజల మధ్య చిచ్చు రగల్చిన కేంద్ర ప్రభుత్వ విధానాలను నిరసిస్తున్నామన్నారు. ఈ దుర్మార్గమైన ఘటన జరిగి ఇప్పటికీ రెండు నెలలు అయినా వారిపై పోలీసులు, అధికార పాలనా యంత్రాంగం ఎలాంటి చర్యలు తీసుకోలేదని, ఈ ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడయాలో వైరల్ కావడంతో దేశ వ్యాప్తంగా తీవ్ర నిరసన, ఆగ్రహం వెల్లువెత్తకుండా జాగ్రత్త పడుతున్నారన్నారు. ఆదివాసీ మహిళగా రాష్ట్రపతి స్పందించకపోవడం బాధాకరమన్నారు. స్త్రీలపై హింసకు, లైంగిక దాడులకు పాల్పడుతున్న వారిని శిక్షించడంలో గానీ, మణిపూర్‌లో శాంతి భద్రతలను కాపాడటంలో గానీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వైఫల్యం చెందాయన్నారు. కాంగ్‌ఫోక్పీలో మహిళలపై అమానుష కాండకు కారకులైన, సామూహిక లైంగిక దాడికి పాల్పడిన నేరస్తులందరికీ తక్షణమే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మౌనం వీడి మణిపూర్‌లో శాంతి భద్రతలను కాపాడాలన్నారు. ఈ కార్యక్రమంలో టీపీటీఎఫ్ ప్రధాన కార్యదర్శి పి. వెంకటరాంరెడ్డి ఉన్నారు.

## సివిల్ సప్లయ్,ఎఫ్‌సిఐలలో అవకతవకల నివారణకు చర్యలు తీసుకుంటాం : కేశవరావ్


ఎఫ్‌సిఐ తెలంగాణ బోర్డు సభ్యుల సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ కేశవరావ్ తదితరులు

అడ్డగుట్ట, జూలై 22 ప్రభాతవార్త: సివిల్ సప్లయ్, ఫుడ్ కార్పోరేషన్ ఆఫ్ ఇండియాలో జరుగుతున్న అవకతవకల నివారణకు తగు చర్యలు తీసుకుంటామని ఎఫ్‌సిఐ తెలంగాణ బోర్డు చైర్మన్ కె.కేశవ రావ్ తెలిపారు. శనివారం సికింద్రాబాద్ ఎస్.డి.రోడ్డులోని ఎఫ్‌సిఐ బోర్డు కార్యాలయంలో నూతనంగా నియమితులైన కమిటీ సభ్యుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కీలక అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఎఫ్‌సిఐ తెలంగాణ బోర్డు చైర్మన్‌గా కేశవ రావ్ నియమితులైనందుకు భారత వినియోగదారుల వ్యవహారాల మంత్రిత్వ శాఖకు అభినందనలు తెలియజేశారు. ఈ సమావేశంలో వివిధ జిల్లాల నుంచి నియమితులైన సభ్యులు సత్య మూర్తి, తిరుపతి, విజేం దర్ రెడ్డి, మహ్మద్ రిజ్వాన్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ సంస్థలో ఆర్.ఎం.వెంకన్న సేవలు మరువలేనివి


బదిలీపై వెళ్తున్న ఆర్టీసి ఆర్.ఎం.విడ్కోలు సమావేశంలో మాట్లాడుతున్న డిఎం.రాంమోహాన్ తదితరులు

కంటోన్మెంట్, జూలై 22 ప్రభాతవార్త: ఆర్టీసి సంస్థను ప్రగతి పథంలో నడిపించేందుకు రీజినల్ మేనేజర్ చెరుకుపల్లి వెంకన్న సేవలు మరువలేనివని సికింద్రాబాద్ డిప్యూటీ రీజినల్ మేనేజర్లు బీమ్‌రెడ్డి, అపర్ణ కళ్యాణిలు తెలిపారు. సికింద్రాబాద్ ఆర్టీసి రీజినల్ మేనేజర్‌గా పనిచేసిన సి.హెచ్.వెంకన్న ఖమ్మం ఆర్.ఎం.గా బదిలీ అవుతున్న సందర్భంగా శుక్రవారం సికింద్రాబాద్ జెబిఎస్‌లో ఏర్పాటు చేసిన విడ్కోలు సమావేశంలో వారు పాల్గొని ఆయన చేసిన సేవలను కొనియాడుతూ పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఒకటిన్నర సంవత్సరంలో ఆర్.ఎం.వెంకన్న విశిష్ట సేవలు అందించి రీజియన్‌ను మొదటి స్థానంలో తీసుకువచ్చి ఉత్తమ రీజినల్ మేనేజర్‌గా అవార్డు పొందడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసి ఉన్నతాధికారులు కవిత,తిరుపతమ్మ, భాస్కర్ రెడ్డి, ఎల్.రాంమోహాన్, లక్ష్మీధర్మ, సరితా రెడ్డిలతో పాటు వివిధ డిపోలకు చెందిన డిఎంలు, అసిస్టెంట్ మేనేజర్లు పాల్గొన్నారు.

## మంత్రి మల్లన్నకు దండు మారెమ్మ బోనాల జాతర ఆహ్వానం


మంత్రి మల్లారెడ్డిని దండు మారెమ్మ బోనాల జాతరకు ఆహ్వానిస్తున్న ముప్పిడి గోపాల్

బేగంపేట జులై 22,ప్రభాతవార్త : బాలంరాయి లో నేడు జరగనున్న దండు మారెమ్మ బోనాల జాతరకు రావాలంటూ మంత్రి చామకూర మల్లారెడ్డిని ఆలయ మండపం నిర్మాణ దాత,టెంపుల్ గోపురం డెవలప్‌మెంట్ కమిటీ చైర్మన్,ముప్పిడి గోపాల్ శనివారం ఉదయం కల్సి బోనాల జాతర ఆహ్వాన పత్రికను అందించారు. ఈ కార్యక్రమంలో గోపాల్ తో పాటు నరేష్, దళితరత్న దర్గ రవికుమార్, రాజ్‌కిరణ్, నాగరాజు, హన్మంతు, వేణుగోపాల్, సాయికుమార్ ఉన్నారు.

## నారా లోకేష్‌తో కలిసి యువగళం పాదయాత్రలో పాల్గొన్న సత్తార్


నారా లోకేష్‌తో కలిసి పాదయాత్ర చేస్తున్న సత్తార్

కెపిహెచ్‌బి కాలనీ, జులై 22, ప్రభాతవార్త : కెపిహెచ్‌బి కాలనీకి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు షేక్ సత్తార్ ప్రకాశం జిల్లా పొదిలి పట్టణంలో జరుగుతున్న యువగళం పాదయాత్రలో శనివారం పాల్గొన్నారు. మార్కాపురం నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ యువనేత నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్రకు అపూర్వ స్పందన లభించిందని అన్నారు. రానున్న ఎన్నికల్లో ఏపిలో తెదేపా అధికారంలోకి వస్తుందని సత్తార్ ఆశాభావం వ్యక్తం చేశారు. తెలుగుదేశం పార్టీ వైపు ప్రజలందరూ మొగ్గు చూపుతున్నారని, రాబోయే రోజుల్లో తెలుగుదేశం పార్టీని ప్రజలు బలపరిచి అధికారంలోకి తీసుకువస్తారని సత్తార్ పేర్కొన్నారు.

## ప్రతి శనివారం జెబిఎస్ నుంచి శ్రీశైలం దర్శన్ బస్సు: డిఎం రవీందర్

కంటోన్మెంట్,జూలై 22 ప్రభాతవార్త: శ్రీశైలం దైవదర్శనానికి వెళ్లే ప్రయాణికుల సౌకర్యార్థం నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీశైలం దర్శన్ సర్వీస్‌ను సద్వినియోగం చేసుకోవాలని పికెట్ డిపో మేనేజర్ ఎల్.రవిందర్ తెలిపారు. శనివారం సికింద్రాబాద్ జూబ్లీ బస్టేషన్ నుంచి శ్రీశైలంకు నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీశైలం దర్శన్ బస్సును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా డిఎం రవిందర్ మాట్లాడుతూ ప్రతి శనివారం ఉదయం ఉదయం 7 గంటలకు జెబిఎస్ నుంచి ఎంజిబిఎస్ 8 గంటలకు బయలు దేరి మధ్యాహ్నాం 1.30నిమిషాలకు చేరుకుంటుందన్నారు. అదే రోజు మల్లికార్జున స్వామి దర్శనం తో పాటు పాతాల గంగా,క్రిష్ణా నదిలో పడవ ప్రయాణం చేయవచ్చన్నారు. ఈ అవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ అశ్విని తదితరులు పాల్గొన్నారు.

## వర్షాలకు కూలిన ప్రహారిగోడ పరిశీలించిన అధికారులు

సికింద్రాబాద్, జూలై 22 ప్రభాతవార్త : నాలుగైదు రోజులుగా కురుస్తున్న వర్షాలకు బన్సీలాల్‌పేట్ డివిజన్ న్యూబోయిగూడలో యాభై సంవత్సరాలుగా నివాసం ఉంటున్న పూరాతన నివాసం ప్రహారిగోడ కూలిపోయింది. శుక్రవారం అర్ధరాత్రి సంఘటన జరిగింది. ఒంట్లో ఉన్నవారికి ఎలాంటి నష్టం సంభవించలేదు. విషయం తెలుసుకున్న డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు ఎల్. వెంకటేషన్ రాజు మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆదేశాల మేరకు సంఘటన స్థలాన్ని సందర్శించి సమాచారాన్ని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌కు వివరించడంతో ఆయన తహసీల్దార్‌తో పాటు ఇతర అధికారులకు కూలిన ఇంటిని పరిశీలించాల్సిందిగా ఆదేశించారు. అధికారులు నివాసాన్ని పరిశీలించిన ప్రభుత్వం తరపున సహాయం అందజేయడానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యాక్రమంలో గజ్జల శ్రీను, కొత్తూరు వెంకటేష్, లంకరాజు, నర్సింగ్, బాలరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## లోతట్టు ప్రాంతాల ప్రజలను బీఆర్ఎస్ అండగా ఉంటుంది

### డిప్యూటీ స్పీకర్ కుమారుడు తీగుళ్ల రామేశ్వర్ గౌడ్


బౌద్ధనగర్‌లో పర్యటిస్తున్న బీఆర్ఎస్ నేతలు

సికింద్రాబాద్, జూలై 22 ప్రభాతవార్త : మూడు, నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా సికింద్రాబాద్ నియోజకవర్గం లోతట్టు ప్రాంతాలలో డిప్యూటీ స్పీకర్ పద్మారావు ఆదేశాల మేరకు కార్పొరేటర్, డిప్యూటీ స్పీకర్ కుమారుడు తీగుళ్ల రామేశ్వర్ గౌడ్ అధికారుల బృందం శుక్రవారం రాత్రి నాలా పరివాహక ప్రాంతాలలోని సీతాఫల్‌మండి, బౌద్ధనగర్ డివిజన్‌లో పర్యటించారు. వరదల కారణంగా జరిగిన నష్టం ఏదైనా ఉంటే ప్రభుత్వం తరపున సహాయం చేయడానికి ఏర్పాట్లు జరుపుతామని వారు లోతట్టు ప్రాంత ప్రజలకు హామీ ఇచ్చారు. అత్యవసర పరిస్థితిలో ప్రభుత్వం తరపున ప్రజలకు అండగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కందిశైలజ, పాకసాయి, సుమలత ఇతర నేతలు పాల్గొన్నారు.

## దరఖాస్తు చేసుకున్న ప్రతి విద్యార్థికి గురుకులం సీటు ఇవ్వాలి

### బిసి విద్యార్థి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేముల రామకృష్ణ


దరఖాస్తు చేసుకున్న విద్యార్థులతో కలిసి మాట్లాడుతున్న వేముల రామకృష్ణ

హైదరాబాద్, జూలై 22,ప్రభాతవార్త: రాష్ట్ర వ్యాప్తంగా గురుకుల పాఠశాలల్లో దరఖాస్తు చేసుకున్న ప్రతి విద్యార్థికి గురుకుల సీట్లు ఇవ్వాలని బిసి విద్యార్థి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేముల రామకృష్ణ డిమాండ్ చేశారు. ఈమేరకు శనివారం విద్యానగర్‌లోని బిసి భవన్ వద్ద పలువురు విద్యా ర్థులు వారి తల్లిదండ్రులతో కలిసి ఆయన మాట్లాడారు. ఈసందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ బిసి సంక్షేమసంఘం జాతీయ అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య నేతృత్వంలో ఎన్నోపోరాటాల ఫలితంగా రాష్ట్ర ప్రభుత్వం గురుకులాలను ఏర్పాటు చేసిందన్నారు. అయి తే అధికారులు మెరిట్ ఆధారంగా సీట్లు కేటాయించడంతో నిరుపేద విద్యార్థులు సీట్లు సాధించలేకపోతున్నారన్నారు. కార్పొరేట్ ప్రైవేట్ పాఠశాలల్లో చదివే విద్యార్థులే మెరిట్‌తో గురుకుల పాఠశాలల్లో సీట్లు సాధించడంతో గ్రామీణ ప్రాంతాల్లోని పేదలు చదువుకు దూరమవుతున్నారన్నారు.హయ్యర్ ఎడ్యూకేషన్ ఇంజనీరింగ్, మెడిసిన్ వంటి ప్రొఫెషనల్ కోర్సులో మెరిట్ ఉంటుందని కానీ ఐదో తరగతి చదివే విద్యార్థులు మెరిట్ ఏంటని ప్రశ్నించారు.

## వికలాంగులకు రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలి

### టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ అధ్యక్షులు పి.సాయిబాబా


ఛలో ఢిల్లీ కరపత్రాన్ని అందుకుంటున్న సాయిబాబా

ధర్నాచౌక్, జూలై 22, ప్రభాతవార్త: వికలాంగులకు రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలని, దీనికై అఖిల భారత వికలాంగుల హక్కుల వేదిక ఆధ్వర్యంలో ఆగస్టు 1న చేపట్టిన ఛలో ఢిల్లీ కార్యక్రమంకు తెలుగుదేశం పక్షాన పూర్తి మద్దతు ఇస్తున్నామని టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ అధ్యక్షులు పి.సాయిబాబా తెలిపారు. శనివారం అఖిల భారత వికలాంగుల హక్కుల వేదిక జాతీయ అధ్యక్షులు కొల్లి నాగేశ్వరరావు లోయర్‌ట్యాంక్‌బండ్‌లోని టీడీపీ కార్యాలయంలో ఆయనను కలసి ఛలో ఢిల్లీ కార్యక్రమంకు మద్దతు ఇవ్వాలని కోరుతూ కరపత్రాన్ని అందచేశారు. ఈ సందర్భంగా సాయిబాబా మాట్లాడుతూ వికలాంగుల జీవితాలలో వెలుగులు తేవాలని వారిపై సానుభూతి కాకుండా వారికి సహకారం అందించి, వారిని సమాజంలో భాగస్వాములు చేయాలనే ఆలోచనతో ఆనాటి ముఖ్యమంత్రి ఎన్టీఆర్ వికలాంగులకు ప్రత్యేక డైరెక్టరేట్ ఏర్పాటుచేశారని గుర్తు చేశారు. ఆ డైరెక్టరేట్‌కు చైర్మన్‌గా వికలాంగుడినే నియమించి, వికలాంగులను రాజ్యాధికారంలో భాగస్వాములు చేయాలని నిస్వార్థంగా కృషి చేసినది తెలుగుదేశం పార్టీ అని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శులు నల్లెల్ల కిషోర్, పి.బాలరాజ్‌గౌడ్, సత్యనారాయణ, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

## మొబైల్ దుకాణంలో అగ్నిప్రమాదం

ఎల్.బి.నగర్, జులై 22 ప్రభాతవార్త : ఓ మొబైల్ దుకాణంలో శుక్రవారం అర్ధరాత్రి అగ్ని ప్రమాదం జరిగింది. ఈ సంఘటన సరూర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం దిల్‌సుఖ్‌నగర్‌లోని ఓ మొబైల్ దుకాణంలో అర్ధరాత్రి విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ జరిగింది. ఈ ప్రమాదంలో దుకాణంలో మంటలు చెలరేగి పొగలు వ్యాప్తించాయి. స్థానికులు గమనించి డయల్ 100 అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. సరూర్‌నగర్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. అప్పటికే అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో దాదాపు రూ.5 లక్షల విలువ చేసే మొబైల్ లు, ఫ్యాన్లు, ఆక్స్‌రిసీవ్స్ అగ్నికి ఆహుతి అయ్యాయి. మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నారు.

## సాయిచంద్ పాట రాయినిసైతం కరిగించింది

### శాసనమండలి సభ్యుడు దశపతి శ్రీనివాస్


గాయకుడు సాయిచంద్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, ఎమ్మెల్యే రసమయి బాలకిషన్

చిక్కడపల్లి, జూలై 22 ప్రభాతవార్త: తెలంగాణ ఉద్యమకారుడు వేద సాయిచంద్ పాట రాయిని సైతం కరిగించే గాత్రం అని రాష్ట్ర శాసనమండలి సభ్యుడు దశపతి శ్రీనివాస్ అన్నారు. శనివారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సాయిచంద్ మిత్ర మండలి ఆధ్వర్యంలో 'సాయిచంద్ సాంస్కృతిక సమ్మేళనం' కార్యక్రమం గాయకుడు యశ్‌పాల్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా దేశపతి శ్రీనివాస్ మాట్లాడుతూ సాయిచంద్ తాను పాడుతున్న సందర్భంలో హృదయాన్ని హత్తుకునేలా పాడడం వల్ల ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయాడన్నారు. అటువంటి విశిష్ట గాయకుడు అని కీర్తించారు. తెలంగాణ ఉద్యమ కాలంలో తన గొంతుక ద్వారా ఎనలేని సేవలు చేశారని, సాంస్కృతిక రంగంలో పాట ఉన్నని రోజులు సాయిచంద్ పాట శాశ్వతంగా నిలిచి ఉంటుందన్నారు. రాతిబొమ్మల్లోన కొలువైన శివుడా పాట సాయిచంద్ పాడితే తప్ప ఆ పాటకు ప్రాధాన్యత ఉంటుందని, ఇతరులు పాడితే అంతగా స్పందన ఉండదన్నారు. సిద్దిపేటలో మంజీరా రచయితల సంఘం తరఫున తాను సాయిచంద్‌తో ఎన్నో పాటలను పాడించడం జరిగిందని, అదే సమయంలో ప్రస్తుత మంత్రి టి.హరీష్‌రావుతో సాయిచంద్‌తో పరిచయడం ఏర్పడిందని, 'రక్తంచేతా రాగాలాపన చేసి, మంటలచేత మాట్లాడింపచేయబడిన శక్తి ఉన్న గాయకుడు సాయిచంద్ అని, మంత్రికి సాయిచంద్ మధ్య బంధం ఏర్పడిందన్నారు. కూడా పాటకు ప్రాధాన్యత ఉండాలని, పాటకు ప్రాధాన్యత లేకపోతే మనుగడ ప్రశ్నార్థకం అని అన్నారు. గాయనీ విమలక్క, పూర్వ లోకసభ సభ్యుడు మల్లు రవి, తెలంగాణ రాష్ట్ర ప్రైవేట్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు గంధం రాములు, సాయిచంద్ తండ్రి వెంకట్రాములు పాల్గొన్నారు.

## భీం పూలే స్టూడెంట్స్ పరివార్ విద్యార్థి సంఘం ఆవిర్భావం


విద్యార్థి సంఘం లోగోను ఆవిష్కరిస్తున్న ప్రకాష్ రాథోడ్, హారిలాల్

తార్నాక, జులై 22 ప్రభాతవార్త: ఒయూ కేంద్రంగా మరో విద్యార్థి సంఘం శనివారం ఒయూలో ఆవిర్భవించింది. ఈ సంఘానికి అధ్యక్షత వహించిన హారిలాల్, ఐటీవో ప్రకాష్ రాథోడ్ విద్యార్థి సంఘంలోగోను ఆవిష్కరించిన అనంతరం వారు మాట్లాడుతూ అంబేద్కర్‌ను ఆదర్శంగా తీసుకొని ఉన్నతంగా ఎదగాలని ఈ ఆర్గనైజేషన్‌ను సమర్థవంతంగా నడిపించాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా నూతన కమిటీలను వేసుకొని బలోపేతం దిశంగా కృషి చేయాలని కోరారు. ఒ.యూలో నియమకాలను జరుపాలని డిమాండ్ చేశారు. అనంతరం సీనియర్ పాత్రికేయులు ఆత్కూరి సంజీవ్ రాజ్ మాట్లాడుతూ దేశంలో మూలవాసులు ఎవరో ఎందుకు కొన్ని జాతులు ఊరికి బయట నివసిస్తున్నాయో లోతుగా తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ దేశంలో ద్రావిడ నాగరితక నాశనం కాబడిందన్నారు. నాగర్‌కర్నూల్‌కు చెందిన మరో అతిథి తిరుపతమ్మ మాట్లాడుతూ బాసీలకు జనాభా దామాషా ప్రకారం రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలని అప్పుడే బహుజన రాజ్యాధికారం వస్తుందన్నారు. తెలంగాణ ఉద్యమంలో తమ బిడ్డలను కోల్పోయిన తల్లుల గాధలను, నేడు నియామకాలు రాక ఇబ్బంది పడుతున్న తల్లి తండ్రులు, విద్యార్థుల బాదలను వర్ణణాతీతం అన్నారు. వారిని ఆదుకోవల్సిన భాధ్యత ప్రభుత్వం పై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో డి. వినయ్, ఎ.ప్రవీన్, డాక్టర్ వరంగల్ రవి, ఎ.వినోద్, ఎన్. ధశరత్, వెంకట్ రామ్, శేకర్, పృథ్వి, ప్రవీణీ, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## క్రియాశీల రాజకీయాల్లోకి సంఘ సేవకుడు


మల్లురవి, రేవంత్‌రెడ్డిని కలిసిన ప్రముఖ సంఘ సేవకుడు నాగులూరి సాయిబాబా

సికింద్రాబాద్, జూలై 22 ప్రభాతవార్త: అనేక సేవా కార్యాక్రమాలు జరుపుతూ చాలా సంవత్సరాల కాలంగా నిత్యం పేదలకు ఆపన్న హస్తంగా ఉంటున్న ప్రముఖ సంఘ సేవకుడుగా వెలుగొందుతున్న నాగులూరి సాయిబాబా ఇకనుండి కాంగ్రెస్ పార్టీ క్రియాశీలక రాజకీయాలలో ప్రముఖ పాత్ర పోషించనున్నారు. శనివారం సికింద్రాబాద్ డీసీసీ అధ్యక్షుడు అనిల్‌కుమార్ యాదవ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి అనంతరం కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ అంజన్ కుమార్ యాదవ్, టీపీసీసీ ఉపాధ్యక్షుడు, మాజీ మంత్రి మల్లురవితో పాటు పీసీసీ రేవంత్‌రెడ్డిని ఆయన స్వగృహంలో కలిసి వస్తృతంగా చర్చించారు. అనంతరం ప్రచార కమిటీ చైర్మన్ మధు యాష్కిని కలిసి ఆయన శుభాశీస్సులు తీసుకున్నారు.

## 24న రవీంద్రభారతిలో "చండాలిక "డాన్స్ బ్యాలే

### కూచిపూడి నృత్యకారిణి క్రాంతి నారాయణ్


కార్యక్రమ బ్రోచర్ ఆవిష్కరిస్తున్న విక్రమ్ కుమార్, హైమావతి భీమన్న, క్రాంతి నారాయణ్, పిడమర్తి రవి తదితరులు

హైదరాబాద్, జూలై 22,ప్రభాతవార్త: క్రాంతి కూచిపూడి నాట్యాలయ ఆధ్వర్యంలో తెలంగాణ సాంస్కృతిక శాఖ సౌజన్యంతో మహాకవి, కళాప్రపూర్ణ ,పద్మ భూషణ్ డాక్టర్ బోయి భీమన్న " చండాలిక " డాన్స్ బ్యాలే ఈనెల 24వ తేదీన సాయంత్రం 6గంటలకు రవీంద్రభారతిలో జరగనుంది. తెలంగాణ సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ అధ్యక్షతన జరగనున్న ఈకార్యక్రమానికి తెలంగాణ సాంస్కృతిక శాఖ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ ముఖ్యఅతిధిగా,పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం వైస్ ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ కిషన్‌రావు ప్రత్యేక అతిధిగా హాజరవుతారని కూచిపూడి నృత్యకారిణి క్రాంతి నారాయణ్ తెలిపారు. శనివారం సోమాజిగూడలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కార్యక్రమం బ్రోచర్‌ను ఆవిష్కరించి ఆమె మాట్లాడారు. "చండాలిక "పాత్రలో కూచిపూడి నృత్యకారిణి క్రాంతి నారాయణ్ నటిస్తుండగా ఆనందగా వి.ఆర్ విక్రమ్ కుమార్, మాలీగా కిరణ్మయి బోనాల, భటులుగా వినోద్, ప్రశాంత్, దీమాన్స్‌గా దింపులు ప్రియా, జాహ్నవి, రీతూ,తులసి నటించనున్నారు. డాక్టర్ బోయి భీమన్న రచించిన చండాలి డాన్స్ బాలేకు ఫణి నారాయణ సంగీతాన్ని అందిస్తుండగా క్రాంతి నారాయణ్ డాన్స్ కొరియోగ్రాఫర్‌గా వ్యవహరిస్తున్నారు. అలాగే ఈకార్యక్రమంలో గౌరవ అతిధులుగా తెలంగాణ స్పెషల్ ఛీఫ్ సెక్రటరీ రాణి కుముదిని, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిదాయల రిజిస్ట్రార్ డాక్టర్ భట్టు రమేష్, ప్రముఖ కూచిపూడి నృత్యకారిణి డాక్టర్ జి.పద్మజారెడ్డి, డాక్టర్ వనజారెడ్డి, భీమన్న సాహితీ నిధి ట్రస్ట్ చైర్మన్ హైమావతి భీమన్న తదితరులు పాల్గొంటారని క్రాంతి నారాయణ్ తెలిపారు.


ముఖ్యమంత్రి కెసిఆర్‌ను కలిసి బోకె అందచేస్తున్న బిఆర్ఎస్ యువ నాయకులు గడ్డం ఆశీష్‌కుమార్‌యాదవ్

## త్వరలోనే నిధులను మంజూరుకు హామీ

బేగంబజార్, జూలై 22 ప్రభాతవార్త: గోషామహల్ నియోజకవర్గంలోని ప్రజా సమస్యలను ముఖ్యమంత్రి కెసిఆర్ దృష్టికి తీసుకు వెళ్లినట్లు గోషామహల్ నియోజకవర్గం బిఆర్ఎస్ యువ నాయకులు గడ్డం ఆశీష్ కుమార్ యాదవ్ అన్నారు.బిఆర్.అంబేద్కర్ సచివాలయంలో ముఖ్యమంత్రి కెసిఆర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు.నియోజక వర్గంలోని చారిత్రత్మాకమైన కట్టడాల అభివద్ధికి నిధులను మంజూరు చేయాలని విన్నవించగా అందుకు స్పందించి త్వరలోనే నిధులను మంజూరు చేస్తానన్నాని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి కెసిఆర్‌కు పుష్ప గుచ్ఛం అందచేశారు.

## సమస్యలు పరిష్కరించేందుకు కృషి

### నాంపల్లి నియోజకవర్గం బిఆర్ఎస్ ఇన్‌చార్జ్ సిహెచ్.ఆనంద్‌కుమార్‌గౌడ్


హోంశాఖ మంత్రి మహముద్‌అలీని కలిసిన ఇన్‌చార్జ్ సిహెచ్.ఆనంద్‌కుమార్‌గౌడ్

అప్జల్‌గంజ్,జూలై 22ప్రభాతవార్త: ఆసిఫ్‌నగర్ డివిజన్ పరిధిలోని ప్రజా సమస్యలను పరిష్కరించే కృషి చేస్తున్నట్లు నాంపల్లి నియోజకవర్గం బిఆర్ఎస్ ఇన్‌చార్జ్ సిహెచ్. ఆనంద్‌కుమార్‌గౌడ్ పేర్కొన్నారు.ఈ మేరకు తెలంగాణ హోంశాఖ మంత్రి మహముద్‌అలీని నాంపల్లి నియోజకవర్గం ఇన్‌చార్జ్ సిహెచ్.ఆనంద్‌కుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో హుడా కాలని అధ్యక్షురాలు గంజి రజని,మాజీ కార్పొరేటర్ మిత్రకృష్ణ,ఈ.రమణి శ్రీనివాస్,రాజు, సులోచన,వినోద్,సందీప్ తదితరులు కలిసి హుడా కాలని పలు సమస్యలపై విన్నవించారు.అందుకు మహాము ద్‌అలీ స్పందించి ఆయా విభాగాల అధికారులతో చర్చించి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామి ఇచ్చినట్లు తెలిపారు.

## వైభవంగా లక్ష్మీనారాయణ అష్టోత్తర మహా యాగం


యాగంలో పాల్గొన్న వేద పండితులు,కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి

మైలార్‌దేవ్‌పల్లి,జూలై 22 ప్రభాతవార్త : అధిక శ్రావణ మాసం సందర్భంగా శనివారం ఆరాంఘర్‌లో అష్టోత్తర శత శ్రీ భాగవత మహా పురాణం,శ్రీ లక్ష్మీ నారాయణ అష్టోత్తర శత మహా యాగం అత్యంత వైభవంగా జరిగాయి.మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో వేద పండితులతో పాటు సంయోజకులు మహేందర్‌సింగ్ నోడియా,శ్రీమద్ భాగవత్ ముఖ్య నిర్వాహకులు జెత్మల్ పరమానందజీ.బన్సల్,యాగ స్థల ముఖ్య యజమాని ఓం ప్రకాష్ ఖండేవల్, దీపక్,కృష్ణ యాదవ్,శ్రీ కాంత్‌రెడ్డి పాండుయాదవ్ పాల్గొన్నారు.

## ఫిల్మ్‌నగర్‌లో నేడు తెలంగాణ సమాజ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ప్రారంభం

### పార్టీ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ పుంజాల వినయ్ కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న వినయ్ కుమార్

కూకట్‌పల్లి, జులై 22, ప్రభాతవార్త : తెలంగాణ సమాజ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నేడు ప్రారంభిస్తున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పుంజాల వినయ్ కుమార్ వెల్లడించారు. ఆదివారం ఉదయం 10గంటలకు కార్యాలయం ప్రారంభంతో పాటు పార్టీ పతకాన్ని ఆవిష్కరించనున్నట్లు తెలియజేశారు. ఇదిలావుండగా ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్రం నలుమూలల నుంచి టిఎస్‌పి కార్యకర్తలు, పలువురు మేధావులు, అభిమానులు పాల్గొననున్నారు. అసెంబ్లీ ఎన్నికలలో మెజారిటీ ఎమ్మెల్యేలను గెలిపించి బడుగు బలహీన వర్గాల అభ్యర్థిని ముఖ్యమంత్రి చేయటమే తెలంగాణ సమాజ కాంగ్రెస్ పార్టీ ముఖ్య ఉద్దేశ్యమని అన్నారు. రాష్ట్రంలోని అన్ని వర్గాలకు ఉచిత విద య, వైద్యం, ఉద్యోగ, ఉపాధి కల్పించటం రాజ్యాధికారంలో మహిళలను భాగస్వాములను చేయడం, రైతుల సంక్షేమాన్ని సాకారం చేయడమే లక్ష్యంగా తెలంగాణ సమాజ కాంగ్రెస్ ఆవిర్భావ సభలో డాక్టర్ పుంజాల వినయ్ కుమార్ స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్రానికి అతి త్వరలో జరగనున్న ఎన్నికలలో బడుగు బలహీన వర్గాలకు చెందిన అభ్యర్థిని ముఖ్యమంత్రిని చేయటమే తెలంగాణ సమాజ కాంగ్రెస్ ఏకైక లక్ష్యమని అన్నారు. చట్ట సభలలో ఎస్సి, ఎస్టీ, బిసి, మైనార్టీలకు ఎక్కువ సీట్లను గెలుపొందే లక్ష్యంతో తెలంగాణ సమాజ కాంగ్రెస్‌ను స్థాపించడం జరిగిందన్నారు. ఆత్మయ బలిదానం చేసుకున్న తొలి, మలిదశ ఉద్యమకారుల సంక్షేమం కోసం ప్రత్యేక బోర్డును ఏర్పాటు చేయడమే తెలంగాణ సమాజ కాంగ్రెస్ లక్ష్యం పెట్టుకుందని ఉద్యమకారులను ప్రభుత్వం పక్కన పెట్టిందని, దళితులను ముఖ్యమంత్రిని చేస్తానని కెసిఆర్ మాట తప్పిందని ప్రజల్లోకి తీసుకెళ్లడం, అధికారంలోకి వచ్చిన తరువాత ఎస్సి, ఎస్టీ, బిసి, మైనార్టీలను కాపాడుకునే బాధ్యత తెలంగాణ సమాజ కాంగ్రెస్ పార్టీ తీసుకుంటుందన్న హామితో ఆ పార్టీ నాయకులు హామి ఇచ్చారు.

## మణిపూర్ అల్లర్లని తీవ్రంగా ఖండించిన

### టిపిసిసి అధికార ప్రతినిధి డా.సత్యంశ్రీరంగం

కెపిహెచ్‌బి కాలనీ, జులై 22, ప్రభాతవార్త : మహిళలపై దాడులు, ఊరేగింపు చేయడం దేశం మొత్తం తలదించుకునే విషయం అని మణిపూర్ అల్లర్లను పార్టీ తరపున తీవ్రంగా ఖండిస్తున్నామని టిపిసిసి అధికార ప్రతినిధి డాక్టర్ సత్యంశ్రీరంగం పేర్కొన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ మణిపూర్‌లో 80రోజులుగా అల్లర్లు జరుగుతున్నా ప్రధానమంత్రి నరేంద్రమోడీ నోరు విప్పకపోవడం సిగ్గుచేటని ధ్వజమెత్తారు. మహిళలపై దాడులు, ఊరేగింపు చేయడం దేశం మొత్తం తలదించుకునే విషయమన్నారు. మణిపూర్ ఘనటపై తక్షణమే విచారణ చేసి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వంలో సమాజంపై అట్టడుగు వర్గాలపూ అగ్రవర్ణాల దాడులు పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మణిపూర్‌లో జరుగుతున్న ఘోరం చూస్తుంటే ఒక్క భారతీయుడి గుండె రగులుతుందని, కేవలం ఆర్థికలాభం కోసం కార్పోరేట్ సంస్థలతో చేయి కలిపిన ప్రధాని మోడీ మనిపూర్‌లో మైనింగ్‌కు అనుకూలంగా ఉన్న గిరిజన ప్రాంతాలను ఆదానీకి కట్టబెట్టే కుట్రలో భాగంగా రెండు వర్గాల మధ్య గొడవలు సృష్టిస్తున్నాడని ఆరోపించారు. మణిపూర్‌లో జరుగుతున్న విధ్వంసాన్ని వెంటనే ఆపి శాంతిని నెలకొల్పాలని సత్యంశ్రీరంగం డిమాండ్ చేశారు.

## నిషేధిత ఉత్పత్తులపై పోలీసుల ఉక్కుపాదం


సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌హెచ్‌ఓ ఎం.సురేందర్

మూసాపేట, జులై 22, ప్రభాతవార్త : మత్తును చిత్తు చేసేందుకు పోలీస్ యంత్రాంగం పకడ్బందీగా చర్యలు చేపడుతూ వాటి విక్రయంపై ఉక్కుపాదం మోపుతోంది. యువతను ప్రలోభాలకు గురిచేసి, తప్పుదారి పట్టిస్తున్నవారు ఎంతటివారైనా సరే ఉపేక్షించేది లేదని ఎస్‌హెచ్‌ఓ ఎం.సురేందర్ స్పష్టం చేశారు. శనివారం కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న పాన్ షాపుల యజమానులు, కార్మికులతో ఎస్‌హెచ్‌ఓ ఎం.సురేందర్ ఆధ్వర్యంలో నిషేధిత ఉత్పత్తులను విక్రయించకూడదని అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సకాలంలో పాన్ షాపులను మూసివేయాలని, పాన్ షాపులలో సిసిటివి కెమెరాలను ఏర్పాటు చేయాలని సూచించారు. అలాగే డ్రగ్స్, గంజాయి, హుక్కా సంబంధిత, ఇతర నిషేధిత ఉత్పత్తులను విక్రయించకూడదని తెలిపారు. మైనర్లకు సిగ రెట్, గుట్కా లాంటివి అమ్మకూడదన్నారు. షాపుల వద్ద ట్రాఫిక్ సమస్యలు కలగకుండా చూడాలని, బహిరంగ ప్రదేశాల్లో ధూమపానాన్ని అనుమతించకూడదని తెలిపారు. నిషేధిత ఉత్పత్తులను విక్రయించేవారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఈ సందర్భంగా హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ ఆర్.ప్రేమ్ సాగర్, సిహెచ్.బల్బీర్, హెచ్‌సి చంద్రకళ, పిసి జీవన్, పిసి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



తూము వద్ద గండిపడి నీరంతా వృధాగా పోతున్న దృశ్యం

## శేరిపల్లి కొత్తకుంటకు గండి నీరంతా వృథా

**టేక్మాల్, జూలై,22 ప్రభాతవార్త:**

కరుస్తున్న వర్షాలకు మండల పరిధిలోని ఎలకుర్తి గ్రామ శివారులోల గల కొత్తకుంటకు శనివారం తూము వద్ద పెద్ద గండి పడి నీరంత వృధా పోతుంది. దీంతో నిండుకున్న కుంట వద్ద గ్రామస్తులు గండి ముసేందుకు ప్రయత్నలు చేశారు. అయిన ఫలితం లేదన్నారు. దీంతో మండల సంబంధీత ఇరిగేషన్ ఎఇ ప్రణీతకు పై విషయాన్ని గ్రామ సర్పంచ్ కుర్తి శ్వేత శేఖర్‌రెడ్డి వివరించగా సరే సోమవారం చూద్దంలే అంటూ సమాధానం ఇచ్చి ఫోన్ పెట్టేశారని అమె తెలిపారు. ఇకనైనా సంబంధీత అధికారులు కట్ట వద్ద పడ్డ బుంగను పూడ్చాలని కోరుతున్నారు.

## మణిపూర్ ఘటన తీవ్ర ఆవేదనకు గురి చేసింది

**-రాష్ట్ర మహిళా కమీషన్ చైర్ పర్సన్ సునితా లక్ష్మారెడ్డి**

శివ్వంపేట, జూలై22 ప్రభాతవార్త: మణిపూర్‌లో జరిగిన ఘటన ప్రతి ఒక్కరిని తీవ్ర ఆవేదనకు గురి చేసిందని, మానవత్వానికి మాయని మచ్చలా మిగిలిపోతుందని రాష్ట్ర మహిళా కమీషన్ చైర్ పర్సన్ వాకిటి సునితా లక్ష్మారెడ్డి విచారం వ్యక్తం చేశారు. మీడియా సమావేశంలో మాట్లాడుతూ మణిపూర్‌లో ఇద్దరు గిరిజనులను వివస్త్రలను చేసి ఊరేగించిన దుర్ఘటన తీవ్రంగా కలచివేసిందని, ఈ ఘటన యావత్తు భారతావని సిగ్గుతో తలదించుకునేవిధంగా చేసిందని ఆమె అభిప్రాయపడ్డారు. ఇటువంటి దుర్మార్గమైన ఘటనలు చోటుచేసుకోకుండా కేంద్ర ప్రభుత్వం, మణిపూర్ రాష్ట్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. ఇద్దరు మహిళలపై జరిగిన ఘటన అమానుషం, చాలా బాధాకరమని, తీవ్రంగా ఆవేదనకు గురి చేసిందని, ఈ ఘటనను తాను తీవ్రంగా ఖండిస్తున్నానని అన్నారు. కేంద్ర ప్రభుత్వం, మణిపూర్ రాష్ట్ర ప్రభుత్వం స్పందించి దుర్మార్గులను కఠినంగా శిక్షించి ఆ మహిళలకు న్యాయం చేయాలని చూడాలని ఆమె కోరారు. ఈ సమావేశంలో బీఆర్‌టీయూ సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు జీవి. శివశంకర్‌రావు, జిల్లా ప్రధాన కార్యదర్శి సిల్వేరు వీరేశం, బీసీ సెల్ అధ్యక్షులు జి. శ్రీనివాస్‌గౌడ్, సర్పంచి బాబురావు, ఎంపీటీసీ మర్రి సత్తిరెడ్డి, కోఆప్షన్ సభ్యులు లాయక్, మర్రి మహేందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

## కాంగ్రెస్ హయాంలోనే ప్రజలకు న్యాయం

**-మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సుదర్శన్‌గౌడ్**

**శివ్వంపేట, జూలై22 ప్రభాతవార్త:** కాంగ్రెస్ పార్టీ హయాంలోనే ప్రజలకు పూర్తి న్యాయం జరిగిందని, ప్రస్తుతం నిత్యావసరు సరుకుల ధరలు పెరగడం, దానితో పాటు రేషన్ వ్యవస్థ అస్తవ్యస్థంగా మారిందని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొడకంచి సుదర్శన్‌గౌడ్ ఆరోపించారు. శనివారం ఆయన మాట్లాడుతూ 22 రోజులు గడుస్తున్నా గ్రామాల్లో నేటి వరకు రేషన్ బియ్యంతో పాటు నిత్యావసర సరుకులు రాకపోవడం ఎంత వరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న సమయంలో తొమ్మిది రకాల రేషన్ సరుకులు అందివ్వడం జరిగిందని ఆయన గుర్తు చేశారు. ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తుండటంతో ప్రజలు బయటకు వెళ్లి పనులు చేసుకునే పరిస్థితులు లేవని, రేషన్ సరుకులు రాకపోవడంతో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సుదర్శన్‌గౌడ్ అన్నారు. అధికార యంత్రాంగం వెంటనే స్పందించి రేషన్ బియ్యం పంపిణీ చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అతి త్వరలో బీఆర్ఎస్ ప్రభుత్వానికి ప్రజలే తగిన గుణపాఠం చెబుతారన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు భాసంపల్లి శ్రీనివాస్‌గౌడ్, మంతూరి రమేష్‌గౌడ్, భానూరి నారాగౌడ్, పాండ్య నాయక్, తిరుపతి రాథోడ్, వెంకటేష్, స్వామి తదితరులు ఉన్నారు.

## ఎమ్మార్పీఎస్ సభను విజయవంతం చేయాలి

**కొల్చారం, జూలై22 ప్రభాతవార్త:**

టీఎన్జీవో భవన్‌లో జరిగే ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల సమావేశాన్ని విజయవంతం చేయాలని కొల్చారం మండల ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు ఆర్కెల ప్రవీణ్ పిలుపునిచ్చారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎస్సీల ఏబీసీడీ వర్గీకరణ సాధనతోనే సామాజిక న్యాయం జరుగుతుందన్నారు. ఈ విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నాంచే ధోరణి వీడాలని, ఆగస్టు రెండవ వారంలో తలపెట్టిన ఛలో హైదరాబాద్ మదిగల విశ్వరూప సభ కోసం ఈ నెల 25న మెదక్‌లో ఏర్పాటు చేసిన సన్నాహక సభలో మందకృష్ణ మాదిగ ముఖ్య అతిథిగా పాల్గొంటారని తెలిపారు. కొల్చారం మండలం నుండి అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

## ఉచిత లైసెన్స్‌లు దరఖాస్తుల స్వీకరణ



ఉచిత లైసెన్స్ కొరకు దరఖాస్తులు చేయిస్తున్న అంజయ్య

**చేర్యాల,జూలై 22, ప్రభాతవార్త** జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, నియోజకవర్గ కో-ఆర్డినేటర్ గుజ్జ సంపత్‌రెడ్డి సూచన మేరకు 18 సంవత్సరాలు నిండిన యువతి, యువకులకు ఉచిత డ్రైవింగ్ లర్నింగ్ లైసెన్స్ పత్రాలను మూడు మండలాల యూత్ ఇంచార్జ్ శివగారి అంజయ్య ధరఖాస్తు చేయించారు. యువత డ్రైవింగ్ లైసెన్సులు లేక ఎన్నో ఇబ్బందులకు గురవుతున్నారని అందుకు ఈ అవకాశాని న యువత సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఆయనతో వైస్ ఎంపిపి నవీన్‌రెడ్డి, గ్రామ అధ్యక్షులు ఆదిరాజు, పెద్దరాజుపేట గ్రామ అధ్యక్షులు రాము, గ్రామ యూత్ అధ్యక్షుడు జంగని మహేష్, పండుగ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల ఆశీర్వాదంతోనే కాంగ్రెస్ పార్టీకి అధికారం

**కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత డాక్టర్ రొండ మల్లారెడ్డి**

**శివ్వంపేట, జూలై22 ప్రభాతవార్త:** ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కళను సాకారం చేసిన సోనియా గాంధీ రుణం తీర్చుకోవాలనే లక్ష్యంతో తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకొచ్చే విధంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన అవసరం ఉందని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు డాక్టర్ రొండ మల్లారెడ్డి అన్నారు. శివ్వంపేటకు వచ్చిన సందర్భంగా ఆయన ప్రభాతవార్తతో మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఐకమత్యంగా ఉండి సమన్వయంతో పనిచేసి పార్టీని గెలిపించేందుకు శక్తివంచన లేకుండా కృషి చేద్దామని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్రంలోకి కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురావడమే లక్ష్యంగా ఇప్పటి నుండే కృతనిశ్చయంతో పనిచేయాల్సిన అవసరం అసన్నమైందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలు కాంగ్రెస్ పార్టీకి పట్టుకొమ్మలన్నారు. రైతులకు ఏకకాలంలో రుణమాఫ, నిరుద్యోగ భృతి, 4016 రూపాయల ఫించన్లవంటి పథకాలు అమలు కావాలంటే కాంగ్రెస్ పార్టీని ప్రజలు ఆదరించాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు నచ్చకా అనేక మంది కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని తెలిపారు. తెలంగాణ ప్రజలు మార్పు కోరుకుంటున్నారని, రైతు వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్న బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని ఎక్కడికక్కడే ప్రశ్నించాలని, రాబోయే ఎన్నికల్లో గద్దె దించాలని డాక్టర్ రొండ మల్లారెడ్డి కోరారు. రైతుల పేరుతో రాజకీయం చేయడం బీఆర్ఎస్ ప్రభుత్వానికి తగదని, ప్రభుత్వ పాలనను ప్రజలు గమనిస్తున్నారని ఆయన అన్నారు.



కరపత్రాలు విడుదల చేస్తున్న జేఏసి నాయకులు

## కలెక్టరేట్ వద్ద నిర్వహించే ధర్నను జయప్రదం చేయాలి

**చేర్యాల,జూలై 22, ప్రభాతవార్త** ఈనెల 24న చేర్యాలను రెవెన్యూ డివిజన్ చేయాలని నిర్వహించే ధర్నను జయప్రదం చేయాలని జేఏసి నియోజకవర్గ నాయకులు అందె అశోక్, ఆకునూరు గ్రామ జేఏసి కన్వీనర్ వెలుగల రఘువీర్, ఎంపిటీసి సుంకరి శ్రీధర్‌గౌడ్‌లు పిలుపునిచ్చారు. మండలంలోని ఆకునూరు గ్రామంలో శనివారం కరపత్రాలు పంచుతూ విస్తృతంగా ప్రచారం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ దిన దినం చేర్యాల పరిస్థితి దిగజారి పోతూ అస్థిత్వాన్ని కోల్పోతుందని, చేర్యాల ప్రాంత ప్రజల చిరకాల కోరిక రెవెన్యూ డివిజన్ కేంద్రంగా ఏర్పాటు చేయాలని జేఏసి ఆధ్వర్యంలో అనేక ఉద్యమాలు నిర్వహిస్తుంటే అధికారంలో ఉన్న బిఆర్ఎస్ పార్టీ నేతలు, జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి ఏ మాత్రం పట్టించుకోవడం లేదన్నారు. ఈ ప్రాంత బిఆర్ఎస్ నాయకులు రెవెన్యూ డివిజన్ కొరకు సహకరించాలి, లేదంటే ఈప్రాంత ద్రోహులుగా మిగిలిపోతారన్నారు. చేర్యాల నుండి కలెక్టర్ కార్యాలయం వరకు బైక్ ర్యాలిగా భారిగా తరలి వెళ్ళి జరిగే ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జేఏసి నాయకులు స్వర్గం శ్రీకాంత్, తాటికొండ వెంకటచారి, తోట బిక్షపతి, రణం వెంవటేశ్వర్లు, సుంకరి వీరయ్య, బదరకంటి శంకర్, ఏళ్ళ శేఖర్‌రెడ్డి, గ్యారదాసు సంతోష్, గాజుల రమేష్, కడారి రాజు, పోలోజు నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాదవశాత్తు వ్యవసాయ బావిలో పడ్డ నక్క



నక్కను బావిలో నుండి బయటకు తీసిన రైతులు, ఫారెస్ట్ అధికారులు

**చేర్యాల,జూలై 22, ప్రభాతవార్త** చేర్యాల మున్సిపాలిటీ 3వార్డులోని రోళ్ళబండ శివారులో నక్క ప్రమాదవశాత్తు వ్యవసాయ బావిలో పడింది. చేర్యాల పట్టణానికి చెందిన రామగళ్ళ నాగరాజు అనే రైతుకు చెందిన వ్యవసాయ బావిలో ప్రమాదవశాత్తు నక్క పడిపోవడంతో శనివారం చుట్టు పక్కల రైతులు గమనించి చేర్యాల ఫారెస్ట్ ఆఫీసర్ రాముడుకు సమాచారం అందించడంతో రాముడుతో పాటు రేంజ్ ఆఫీసర్ శ్రీనివాస్ సిబ్బంతో కలిసి అక్కడికి చేరుకుని స్ధానిక రైతులు నాగరాజు, నరేష్, మున్సిపల్ చైర్మన్ అంకుగారి స్వరూపరాణి శ్రీధర్‌రెడ్డి,రావుల ఉమేష్‌ల సహకారంతో నక్కను బయటకు తీశారు.

## మంత్రులు కేటీఆర్, హరీష్‌రావులకు ధన్యవాదాలు

### ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి




మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి

**మెదక్ అర్బన్, జూలై22 ప్రభాతవార్త:**

మెదక్, రామాయంపేట మున్సిపాలిటీలకు 20 కోట్ల చొప్పున మంజూరు చేసిన రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి కేటీఆర్, సహకరించిన మంత్రి హరీష్‌రావులకు మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా శనివారం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి మీడియా సమావేశంలో మాట్లాడుతూ రెండు మున్సిపాలిటీల్లో అవసరం ఉన్న చోట ఔట్‌లెట్స్, డ్రైన్స్, సీసీ రోడ్లు, రోడ్ల మరమ్మత్తులు, మిషన్ భగీరథతో ధ్వంసమైన రోడ్లను తక్షణమే మరమ్మత్తులు చేయనున్నట్లు తెలిపారు. ఎంఎన్ కెనాల్ పొంగిపొర్లడం వలన సాయినగర్ కాలనీలో వరద నీళ్లు వచ్చాయని, వచ్చే సంవత్సరం నాటికి కాలనీలోకి నీరు రాకుండా శాశ్వత పరిష్కారం చేసేలా చర్యలు చేపడతామన్నారు. వర్షాకాలం వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున పరిసరాలను ప్రజలంతా పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. మెదక్ నియోజకవర్గంలో ఏడు డెంగ్యూ కేసులు నమోదయ్యాయని అన్నారు. ప్రస్తుతం వారి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని తెలిపారు. మెదక్ పట్టణంలోని నాయక్ చెరువు ప్రమాద హెచ్చరిక ఉందని వెంటనే తక్షణ చర్యలు చేపట్టాలని ఇరిగేషన్ అధికారులకు సూచించారు. చెరువులు, కుంటలు, తూములు డ్యామేజ్ ఉంటూ ఇరిగేషన్ అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని, వారు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పాత ఇళ్లలో ఎవరూ ఉండకూడదని, కూలిపోయే ప్రమాదం ఉంటుందని, సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని కోరారు. అలాగే కూలిపోయిన ఇళ్లకు తక్షణమే నిర్మించుకోవడానికి 3 లక్షల రూపాయలు మంజూరు చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో మెదక్ మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్, కౌన్సిలర్ జయరాజ్, మెదక్ ఆత్మ కమిటీ చైర్మన్ అంజాగౌడ్, రైతుబంధు అధ్యక్షులు కిష్టయ్య, నాయకులు గడ్డమీది కృష్ణాగౌడ్, రాగి అశోక్, లింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు వేయాలని రోడ్డెక్కిన కాంగ్రెస్ నాయకులు



రోడ్డు వేయాలని ధర్నా చేస్తున్న కాంగ్రెస్ నాయకుల దృశ్యం

**కంగ్టి, జులై 22, ప్రభాతవార్త:** మండల కేంద్రమైన కంగ్టి పట్టణంలోని సుభాష్ చంద్ర బోస్ కూడలి నుంచి పిట్లం రోడ్డులోని ఎస్‌సి కాలనీ వరకు రోడ్డు సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేస్తూ శనివారం కాంగ్రెస్ నాయకులు రోడ్డెక్కి రాస్తారోకో చేశారు. అన్నీ ఉన్నా అల్లుని నోట్లో శని అన్న చందంగా రోడ్డు పరిస్థితి మారిందని నాయకులు విచారం వ్యక్తం చేశారు. పలు మార్లు రోడ్డు వేయాలని అధికారులకు, పాలకులు విన్నవించినా అంటీ ముట్టనట్లుగా వ్యవహరిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు స్పందించి రోడ్డును నిర్మించాలని లేకుంటే నారాయణఖేడ్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయాన్ని ముట్టడించాల్సి వస్తుందని నాయకులు హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు చంద్రారెడ్డి, మహిపతి నాయక్, శ్రీనివాస్‌రెడ్డి, కాలే రాజు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

## గ్రామ పంచాయితీ కార్మికులకు గొడుగుల పంపిణీ

**అల్లాదుర్గం, జూలై22 ప్రభాతవార్త:** అల్లాదుర్గం మండల పరిధిలోని గడిపెద్దాపూర్ గ్రామ పంచాయితీ కార్మికులకు అధిక వర్షాలు కురుస్తున్నాయని గ్రహించి వారి రక్షణ కొరకు ఉచితంగా గ్రామ సామాజిక కార్యకర్త నందిమట్టు నర్సింహరాజు శనివారం గొడుగులను పంపిణీ చేశారు. గడిపెద్దాపూర్ గ్రామ పంచాయితీ పారిశుద్ధ్య కార్మికులు, గ్రామ సేవకులు, గ్రామంలో నీటి సరఫరా చేసే వారు నిత్యం ప్రజల కోసం పని చేస్తున్నారని గుర్తించి వారికి చేయూత సహాయంగా సామాజిక దృక్పథంతో గొడుగులను పంపిణీ చేశారు.ఎంపీటీసీ విఠల్‌రెడ్డి, గడిపెద్దాపూర్ గ్రామ బీఆర్ఎస్ అధ్యక్షులు దుర్గారెడ్డి, రవి పంతులు, నాయకులు నారెడ్డి దుర్గారెడ్డి, కార్మికులు, గ్రామ సేవకులు తదితరులు పాల్గొన్నారు.

## తౌర్యా నాయక్ మృతి తిరని లోటు

**చిన్నశంకరంపేట,జూలై 22, ప్రభాతవార్త:** బిఆర్ఎస్ పార్టీ నాయకుడు, నార్సింగి సొసైటి మాజీ చైర్మన్, నార్సింగి మండల పార్టీ మాజీ అధ్యక్షుడు తౌర్యా నాయక్ మృతి పార్టీకి తీరని లోటని బిఆర్ఎస్‌పార్టీ మండల అధ్యక్షుడు పట్లోరి రాజు అన్నారు. శనివారం నార్సింగి మండలం వల్లూర గ్రామం వద్ద జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో తౌర్యానాయక్, కుమారుడు అంకిత్ మృతి చెందడం బాధకరం అని అన్నారు.



డిఈవోకు వినతి పత్రం అందజేస్తున్న యూటీఎఫ్ నాయకులు

## ప్రతి రెండు నెలలకోమారు ఉపాధ్యాయ సంఘాల సమన్వయ సమావేశం ఏర్పాటు చేయాలి

**సిద్దిపేట రూరల్, జూలై 22, ప్రభాతవార్త :** ప్రతి రెండు నెలలకోమారు ఉపాధ్యాయ సంఘాల సమన్వయ సమావేశం ఏర్పాటు చేయాలని టిఎస్ యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదరి ్శ తప్పెట్ల యాదగిరి అన్నారు. జిల్లా కలెక్టరేట్‌లోని డీఈఓ కార్యాలయంలో శనివారం యూటీఎఫ్ జిల్లా కమిటీ అధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ విద్యా సంవత్సరం ప్రారంభమై నెల పూర్తి కావడంతో విద్యారంగ అ ంశాలతో పాటు జిల్లాలో కొనసాగుతున్న ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియపై ఉపాధ్యాయ సంఘాలతో చర్చించాలన్నారు. ప్రతి రెండు నెలలకోమారు జిల్లాలోని ఉపాధ్యాయ సంఘాలతో సమావేశం ఏర్పాటు చేయాలనే విధానం 1995 సంవత్సరం నుంచి ప్రభుత్వం అవకాశం కల్పించిదని పేర్కొన్నారు. జిల్లాలో విద్యాభివృద్ధికి సంఘాల సహకారం అవసరమన్నారు. కార్యక్రమంలో టిఎస్ యూటీఎఫ్ జిల్లా కార్యదర్శులు కొమ్ము కనకరాజు, డి.గిరి బాబు, జిల్లా కోశాధికారి ఎం.కృష్ణ, జిల్లా అడిటింగ్ కమిటీ కన్వీనర్ టి.శివలిం గం, జిల్లా కమిటీ సభ్యులు ఎన్.నిరంజన్, ఈ.రాజు. సాగర్ తదితరులు పాల్గొన్నారు.

## చిరు వ్యాపారులకు హరీష్ నీడ

**వ్యాపారులకు గొడుగులు అందజేసిన పార్టీ శ్రేణులు**

**సిద్దిపేట రూరల్, జూలై 22, ప్రభాతవార్త :** సిద్దిపేట పట్టణంలో పుట్ పాత్‌లపై చిరు వ్యాపారం చేసే వారికి మంత్రి హరీష్‌రావు నీడనిచ్చారు. ఎండనక, వాననక పొట్టకూటి కోసం కష్టపడి చిరు వ్యాపారం చేసుకునే వారికి మంత్రి హరీష్‌రావు అండగా నిలిచారు. ఇటీవల కురిసిన భారీ వర్షాల నేపథ్యంలో మంత్రి హరీష్‌రావు పట్టణంలో పర్యటించగా పుట్ పాత్‌లపై కంకులు, పూలు, పండ్లు అమ్ముకునే వారు వర్షంలో తడవటం చూసి చలించిపోయారు. వెంటనే వారికి గొడుగులు ఏర్పాటు చేయాలని నిర్ణయానికి వచ్చారు. ఈనేపథ్యంలో సిద్దిపేట పట్టణంలోని చిరు వ్యాపారం చేసుకొనే వారికి మంత్రి అందజేసిన గొడుగులను శనివారం బీఆర్ఎస్ పట్టణ పార్టీ అధ్యక్షులు కొండం సంపత్‌రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ కడవెర్గు రాజనర్సు చేతుల మీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు, అర్బీపే సభ్యులు, పార్టీ శ్రేణులు కలకుంట్ల మల్లికార్జున్, గుండ్ల యోగి, సుందర్,నాయకం లక్ష్మణ్, నాగరాజురెడ్డి, ఇర్షద్, నరేష్, రమేష్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేను సన్మానించిన బిఆర్ఎస్ నాయకులు



ఎమ్మెల్యే మాణిక్‌రావును సన్మానిస్తున్న బిఆర్ఎస్ నాయకుల దృశ్యం

**జహీరాబాద్, జులై 22, ప్రభాతవార్త:** జహీరాబాద్ మున్సిపల్ అభివృద్ధికి 30 కోట్ల రూపాయలను మంజూరు చేయించుకున్న ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావును శనివారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బిఆర్ఎస్ నాయకులు శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. జహీరాబాద్ ప్రాంత అభివృద్ధిపై ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు, రాష్ట్ర మంత్రులు తన్నీరు హరీష్‌రావు, కల్వకుంట్ల తారక రామారావులను నాయకులు కొనియాడారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు సయ్యద్ మోహియోద్దిన్, డిసిఎంఎస్ చైర్మన్ మల్కాపురం శివకుమార్, సిడిసి చైర్మన్ ఉమాకాంత్ పాటిల్, మాజీ మున్సిపల్ చైర్మన్ మంకాల్ సుభాష్, మాజీ మార్కెట్ కమిటి చైర్మన్ గుండప్ప, మాజీ ఆత్మ కమిటి చైర్మన్ విజయ్‌కుమార్, మొగుడంపల్లి మండల బిఆర్ఎస్ అధ్యక్షులు శ్రీనివాస్‌రెడ్డి, ఎస్సీ,ఎస్టీ విజిలెన్స్ సభ్యులు రామకృష్ణ, మొగుడంపల్లి సర్పంచ్ ఫోరం అధ్యక్షులు సురేష్, నాయకులు ఢిల్లీ వసంత్, వైజనాథ్, ప్రభు పాటిల్, మాచనూర్ వెంకటేశం, ప్రభాకర్, మిథున్‌రాజ్, ఇజ్రాయిల్ బాబి తదితరులు పాల్గొన్నారు.

## ఆర్థిక మంత్రి హరీష్‌రావుకు బిఆర్ఎస్ నేతల కృతజ్ఞతలు



మంత్రి హరీష్‌రావును కలిసి కృతజ్ఞతలు తెలుపుతున్న బిఆర్ఎస్ నాయకులు

**జహీరాబాద్, జులై 22, ప్రభాతవార్త:** జహీరాబాద్ మున్సిపాలిటీకి 30 లక్షల రూపాయలు మంజూరు చేయడం పట్ల బిఆర్ఎస్ నాయకులు రాష్ట్ర ఆర్థిక మంత్రి తన్నీరు హరీష్‌రావును కలిసి కృతజ్ఞతలు తెలిపారు. శనివారం ఉదయం హైద్రాబాద్‌లోని మంత్రి హరీష్‌రావు నివాస గృహానికి బిఆర్ఎస్ నాయకులు, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ నామ రవికిరణ్ పుష్పగుచ్చం అందించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా నామ రవికిరణ్ మాట్లాడుతూ బిఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి జహీరాబాద్ మున్సిపాలిటీకి గ్రాంట్ రూపంలో 114.5 కోట్ల రూపాయలను (ఎస్‌డిఎఫ్ నిధులు 50 కోట్లు, టియుఎఫ్ఐడిసి నిధులు 64.5 కోట్లు) మంజూరు చేసి మున్సిపల్ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తోందన్నారు. మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి చేస్తున్న సిఎం, మంత్రులు, ఎంపి, ఎమ్మెల్యేల పనితీరును కొనియాడారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ పట్టణ మాజీ అధ్యక్షులు మహమ్మద్ యాకూబ్, మాజీ కౌన్సిలర్ యూనుస్, పట్టణ బిసి సెల్ అధ్యక్షులు రాజా రామేష్ యాదవ్, నరేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పోలీసులకు రేయిన్ కోట్లు పంపిణీ చేసిన ఎమ్మెల్యే

**పటాన్‌చెరువు, జులై 22, ప్రభాతవార్త:** శాంతిభద్రతల పరిరక్షణలో తెలంగాణ రాష్ట్ర పోలీసులు దేశానికి ఆదర్శంగా నిలుస్తున్నారని పటాన్‌చెరువు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. పటాన్‌చెరువు నియోజకవర్గ పరిధిలోని ట్రాఫిక్ విభాగంలో పనిచేస్తున్న పోలీసులకు ముత్తూట్ ఫైనాన్స్ సంస్థ సహకారంతో సురక్ష సేవా సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి చేతుల మీదుగా రేయిన్ కోట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన అనంతరం పోలీస్ విభాగంలో సీఎం కేసీఆర్ చేపట్టిన విప్లవాత్మక సంస్కరణలు దేశానికే ఆదర్శంగా నిలిచాయన్నారు. అతి త్వరలో నియోజకవర్గ పరిధిలో పనిచేస్తున్న పోలీసులందరికీ రేయిన్ కోట్లు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌రెడ్డి, ముత్తూట్ ఫైనాన్స్ లిమిటెడ్ సిఎస్ఆర్ మేనేజర్ యమగాని లక్ష్మీనరాయణ, రీజనల్ అడ్మిన్ మేనేజర్ బిందు, సునీత, సురక్ష సేవా సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు కిక్కర గోపీ, శంకర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.




పోలీసులకు రేయిన్ కోట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి



నిరుపేదలకు టార్పలిన్‌లను పంపిణీ చేస్తున్న సొసైటి సభ్యులు

## నిరుపేదలకు టార్పలిన్‌లు పంపిణీ

**రామాయంపేట,జూలై 22, ప్రభాతవార్త:** ఇండియన్ రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో నిరుపేదలను ఆదుకున్నారు. రాష్ట్ర అధ్యక్షులు, గవర్నర్ డా.. తమిలసాయి సౌందరరాజన్,మెదక్ కలెక్టర్ రాజర్షి షా ఆదేశానుసారం గడిచిన ఆరు రోజుల నుండి విపరీతంగా కురుస్తున్న వర్షాలకు మెదక్ పట్టణంలోని గోల్కొండ వీధిలోని ఎస్సీ కాలనీలో రెడ్ క్రాస్ సభ్యులు పరిశీలించారు. ఆరు పెంకుటిళ్లు, గుడిసెలు చెడిపోయి వర్షం నీరు కురుస్తున్నందు వల్ల బాధితులను పరామర్శించి వారికి ధైర్యం చెప్పి ఉదయం 11 గంటలకు రెడ్‌క్రాస్ ఎం.సి సభ్యులు ప్రభురెడ్డి, మెదక్ 13వ వార్డు కౌన్సిలర్ వి.సులోచన ప్రభురెడ్డి అక్కడి వారి పరిస్థితి వివరించగా మంచి క్వాలిటీతో కూడుకున్న టర్పాలిన్ షిట్లను అందించడం జరిగిందని రెక్ క్రాస్ మెదక్ శాఖ చైర్మన్ డా,,ఎలేటి రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో టీ.సుభాష్ చంద్రబోస్, కోశాధికారి డిజి శ్రీనివాస్ శర్మ, మెనేజ్‌మెంట్ కమిటి సభ్యులు దేమే యాదగిరి, ప్రభురెడ్డిలు వార్డు సభ్యులు, ప్రజలు పాల్గొన్నారు.

## సేవా కార్యక్రమాల కోసం స్థలం కేటాయించండి



స్థలం కోసం ఎమ్మెల్యే పద్మకు వినతి పత్రం అందిస్తున్న రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు

**రామాయంపేట,జూలై 22, ప్రభాతవార్త:**

గడచిన 5 సంవత్సరాల నుండి నిరుపేదలకు, అర్హులకు వృద్ధులకు, మారుమూల ప్రాంతాల వారికి రెడ్ క్రాస్ ద్వారా రక్తదాన శిభిరాలకు, ఆరోగ్య శిభిరాలను నిర్వహించి, సేవలను అందిస్తున్నామని, అలాగే పర్యావరణ పరిరక్షణ కింద కార్యక్రమాలు చేపడుతున్నట్లు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటి మెదక్ శాఖ చైర్మన్ డా,,ఎలేటి రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. ఇటీవల నూతనంగా ఎన్నుకోబడిన మెదక్ రెడ్ క్రాస్ శాఖ కమిటీ మెదక్ శాసన సభ్యురాలు పద్మాదేవేందర్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. అలాగే రక్త నిధి కేంద్రాన్ని, వృద్దుల ఆశ్రమాన్ని, ఇతర సేవా కార్యక్రమాలను కొనసాగించడానికి పక్కా భవానికి రెండు ఎకరాల స్థలం కేటాయించాలని, జిల్లా కోశాధికారి డి.జి శ్రీనివాస శర్మ, మెనేజ్‌మెంట్ కమిటి సభ్యులు వి ప్రభురెడ్డి, దేమే యాదగిరిలు కోరారు. అంతకు ముందు ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డిని శాలువాతో ఘనంగా సన్మానించారు. భవిష్యత్తులు తాము చేపట్టబోయే సేవా కార్యక్రమాలలో పాల్గొని, చేయూతనందించవలసిందిగా కోరారు. ఎమ్మెల్యే ఈ విషయమై సానుకూంగా స్పందించి, తన వంతుగా సహాయ సహకారాలందిస్తానని సభ్యులకు హామినిచ్చారు.

## శానిటేషన్ సిబ్బందికి రైస్,దుస్తుల పంపిణీ

**రామాయంపేట,జూలై 22, ప్రభాతవార్త:** రామాయంపేట మున్సిపల్ కార్యాలయంలో శనివారం నాడు శానిటేషన్ సిబ్బంది 52 మందికి రైస్,దుస్తులు పంపిణి చేశారు. రామాయంపేట మున్సిపల్ చైర్మన్ పల్లె జితేందర్ గడ్, మున్సిపల్ కమిషనర్ ఉమాదేవి, కౌన్సిలర్లు దేమే యాదగిరి, చిలుకా గంగాదర్, కో ఆప్షన్ సభ్యులు ఐరెని బాలుగౌడ్, ఎస్‌కే హైమద్, పార్టీ నాయకులు పుట్టి యాదగిరి, చంద్రబాబు, కొండల్‌రెడ్డి, దేవుని రాజు తదితరులు పాల్గోన్నారు. అలాగే మూడవ వార్డు నుండి కేసీఆర్ కాలని నుండి వచ్చే మురికినీటి సమస్యకు చర్యలు తీసుకున్నట్లు చైర్మన్ జితేందర్‌గౌడ్ తెలిపారు.

## బీఎల్‌వోలకు అవగాహన సదస్సు



అవగాహన సదస్సులో పాల్గొన్న బీఎల్‌వోలు

**వెల్దుర్తి, జూలై22 ప్రభాతవార్త:** 18 సంవత్సరాలు నిండి ప్రతి యువతీ, యువకుడు ఓటరుగా నమోదు చేసుకునేలా చూడాలని బీఎల్‌వోలకు మాస్టర్ ట్రైనర్లు లక్ష్మీనారాయణ, సత్యనారాయణలు అవగాహన కల్పించారు. శనివారం మండల కేంద్రమైన వెల్దుర్తిలోని స్థానిక ఎంపీడీవో సమావేశ మందిరంలో బీఎల్‌వోలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాస్టర్ ట్రైనర్లు లక్ష్మీనారాయణ, సత్యనారాయణలు పాల్గొని బీఎల్‌వోలకు అవగాహన కల్పించారు. ప్రతి గ్రామంలో 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరు నమోదు చేసుకునేందుకు ప్రతి ఇంటికి వెళ్లి అవగాహన కల్పించాలన్నారు. రానున్న ఎన్నికల దృష్ట్యా ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు వచ్చే విధంగా క్షేత్ర స్థాయిలో పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల బీఎల్‌వోలు పాల్గొన్నారు.

## పొంగి పొర్లుతున్న ఘనపూర్ ఆనకట్ట



పొంగి పొర్లుతున్న ఘనపూర్ ఆనకట్ట

**కొల్చారం, జూలై22 ప్రభాతవార్త:** గత మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు కొల్చారం మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో చెరువులు, కుంటలు జల కళను సంతరించుకున్నాయి. మండలంలోని చిన్నఘనపూర్ గ్రామ శివారులోని ఘనపురం ఆనకట్ట నిండు కుండలా మారి పొంగి పొర్లుతుంది.

### గోద్రెజ్ గ్రేసియాను ఉపయోగించడం కొనసాగిస్తాం

గోద్రెజ్ ఆగ్రోవెట్ లిమిటెడ్ క్రాప్ ప్రొటెక్షన్ బిజినెస్ శనివారం ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణ రైతులు మిర్చి కోసం గోద్రెజ్ గ్రేసియాను వచ్చే సీజన్‌లో కూడా ఉప యోగించాలనే తమ ఆసక్తిని వెల్లడించారు. మిరప పంట దిగుబడిని సగటున 30 నుంచి 35 శాతం వరకు ప్రభావితం చేసే తెగుళ్లతో గోద్రెజ్ గ్రేసియా పొలాల్లో ఆకు తినడం మరియు రసం పీల్చడం వంటి లార్వా గొంగళి పురుగులు మరియు త్రిప్స్ వంటి చీడపీడలపై అద్భుతమైన నియంత్రణను ప్రదర్శిస్తుంది.

